J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74

నెల్లూరు, 22.05.2020, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 51 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

### లాక్‌డౌన్ నిబంధనలు పాటించకుండా...

# పరిధులు దాటితే ప్రమాదమే!

- జూన్ 1 నుండి జనజీవనం పునః ప్రారంభం
- కరోనా వైరస్‌ను కామన్ జబ్బు క్రిందకు తీసుకున్న కేంద్రం
- మరణాల రేటు తక్కువగా వుందనే ధైర్యం
- ఆర్థికంగా దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు
- ఎగరనున్న విమానం, పట్టాలెక్కిన రైలు, రోడ్లమీదకొచ్చిన బస్సు
- తెరుచుకున్న ప్రభుత్వ కార్యాలయాలు



కరోనా వైరస్... దాని నేపథ్య లాక్‌డౌన్ పరిస్థితుల నుండి భారతదేశం ఇప్పుడిప్పుడే బయటపడుతోంది. రెండు నెలలకుపైగా లాక్‌డౌన్‌తో దేశంలో అన్ని రంగాలు స్థంభించిపోయాయి. లాక్‌డౌన్ దేశంలో కొన్ని అనివార్య కారణాలవల్ల సంపూర్ణ ఫలితాలను ఇవ్వలేకపోయినా అమెరికాలో మాదిరిగా కేసులు ప్రమాదకర స్థాయిలో పెరగకుండా నిరోధించగలిగింది. ఢిల్లీ మర్కజ్, చెన్నై కోయంబేడు మార్కెట్ వంటి ఘటనలు లేకపోయి వుంటే దేశంలో కేసులు ఇంకా తగ్గివుండేవి. వైరస్ ప్రభావం కూడా చాలా తక్కువ ప్రాంతాలకు పరిమితమై వుండేది. ఈ సంఘటనల మూలంగానే దేశంలో కరోనా పాజిటివ్‌ల సంఖ్య లక్షను దాటిపోయింది.

## సడలుతున్న ఆంక్షలు

కరోనా వైరస్‌ను పూర్తిగా నిర్మూలించడం అసాధ్యం అన్నది ప్రపంచ వ్యాప్తంగా తేలిపోయింది. కరోనాతో కలిసి కాపురం చేయాల్సిందేనని శాస్త్రవేత్తలు సైతం చెబుతున్నారు. వ్యాక్సిన్ వచ్చేదాకా కరోనాతో యుద్ధం తప్పదు. ఒకవేళ వ్యాక్సిన్ వచ్చినా వైరస్ పూర్తిగా అంతమయ్యే పరిస్థితి లేదు. వ్యాక్సిన్ రావడానికి ఇంకో ఏడాది పట్టొచ్చు. అప్పటిదాకా ఏ దేశం కూడా షట్‌డౌన్ చేసుకుని కూర్చోలేదు. రెండు నెలల లాక్‌డౌన్‌కే అగ్రదేశాల ఆర్థిక వ్యవస్థలే దెబ్బతిన్నాయి. అలాంటిది భారత్ లాంటి వర్ధమాన దేశం ఇలాంటి సంక్షోభాలను తట్టుకోవాలంటే కష్టమే! కాబట్టే ప్రధాని నరేంద్ర మోడీ ఓవైపు ప్రజల ప్రాణ రక్షణ కోసం లాక్‌డౌన్‌ను విడతలవారీగా కొనసాగిస్తూనే ఇంకోపక్క దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడానికి కీలక రంగాలకు సడలింపులనిస్తూవచ్చాడు. ముఖ్యంగా దేశ వ్యాప్తంగా చూస్తే వైరస్ వున్నది 20 శాతం భూభాగంలో అయినా దీని ప్రభావం మాత్రం దేశమంతా వుంది. వైరస్ ప్రభావం లేని రాష్ట్రాలు సైతం (మిగతా 2వ పేజీలో)





### వలస జీవుల పాలిట..

# ఆపద్బాంధవుడు జగన్

- రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా సేవా కార్యక్రమాలు
- పేదల పట్ల మానవత్వం చూపిన సీఎం

లాక్‌డౌన్‌తో ప్రపంచమే ఇంట్లో కూర్చుంది. రోజూ కోట్లలో సంపాదించేవాళ్ళు కూడా ఇంటికి పరిమితమయ్యారు. కరోనా వైరస్‌కు భయపడి అందరూ ప్రాణాలు కాపాడుకోవడానికి ప్రాధాన్యతనిస్తే, ప్రాణాలను పణంగా పెట్టి ఉన్నచోట బ్రతకలేక, సొంతూర్లకు వెళ్లడానికి బండి లేక కాలినడకన రోడ్డెక్కింది వలస కూలీలు మాత్రమే!

కరోనా వైరస్ మూలంగా విధించిన నాలుగు విడతల లాక్‌డౌన్‌లో ప్రభుత్వాల వైపు నుండి అతిపెద్ద వైఫల్యం వలస కూలీలు రోడ్డెక్కి, వందల కిలోమీటర్లు నడుచుకుంటూ తమ స్వగ్రామాలకు చేరుకుంటుండడం. వలస కూలీల విషయంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు తప్పటడుగులు వేశాయి. లాక్‌డౌన్ అంటే ఎక్కడికక్కడ స్థంభించిపోవడం, వలస కూలీలు సైతం ఎక్కడ పనిచేసేవాళ్ళు అక్కడే వుండిపోవాలి. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే వారికి ఆహారం, వసతి సమకూర్చాలి. ఈమేరకు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసింది. అయితే వలసకూలీల గురించి రాష్ట్ర ప్రభుత్వాలకు సరైన మార్గదర్శకాలను కేంద్రం నిర్దేశించలేకపోయింది. దీంతోనే వలస కూలీలు తాము పనిచేసే చోట్ల సరైన ఆహారం, వసతి లేక మండుటెండల్లో ఇంటి బాట పట్టారు. లాక్‌డౌన్ మొత్తం వలస కూలీల అంశం పెద్ద వివాదాస్పదంగా, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి ప్రతిరూపంగా మారింది. (మిగతా 2వ పేజీలో)

### నెల్లూరుకు విముక్తి...

# పేటలో కరోనా కాటు




కరోనా వైరస్ నుండి విముక్తి పొందడానికి నెల్లూరు నగరం ముస్తాబవుతోంది. సూళ్ళూరుపేటకు కోయంబేడు లింకు లేకపోయినట్లయితే నెల్లూరుజిల్లా గ్రీజోన్ కావడానికి దగ్గరలో వుండేది. వూహించని విధంగా కోయంబేడు లింకు కేసులు సూళ్ళూరుపేటను కుదిపేశాయి. నెల్లూరు జిల్లాలో వంద కేసులు దాటడానికి రెండు నెలలు పడితే కోయంబేడు పుణ్యమా అని దాదాపు మరో వంద కేసులు పెరగడానికి రెండు వారాలు కూడా పట్టలేదు.

నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాల, నారాయణ కోవిడ్ ఆసుపత్రులలో కరోనా పాజిటివ్ కేసులు దాదాపు డిశ్చార్జ్ కావొచ్చాయి. చాలా తక్కువ మంది మాత్రమే ఇక్కడ చికిత్స పొందుతున్నారు. (మిగతా 2వ పేజీలో)

# సాంకేతిక రూపశిల్పి రాజీవ్



ఈ నెల 21వ తేదీన మాజీప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధి వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని ఇందిరా భవన్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశానికి ఐటి, టెలికాం రంగాల్ని అభివృద్ధి చేసి దాని ఫలితాల్ని మనకి అందించిన ఘనత రాజీవ్‌గాంధీదేనన్నారు. పంచాయతీలకు నిధులను నేరుగా అందించి, యువతకు 18సంవత్సరాలకు ఓటు హక్కును కల్పించిన మహానాయకుడు కూడా ఆయనేనన్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉడతా వెంకట్రావుయాదవ్, ఏటూరు శ్రీనివాసులురెడ్డి, బాల సుధాకర్, లతారెడ్డి, మోహన్‌రెడ్డి, హుస్సేన్ బాషా, మహేష్ రెడ్డి, పి.గణేష్‌బాబు, రాజేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కరోనాపై పోరుకు...
# GVK 2 కోట్ల విరాళం

కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న నేపథ్యంలో కరోనాపై సమరం సాగించి ఆ మాయదారి వ్యాధిని నిర్మూలించేందుకు ప్రభుత్వాలు చేస్తున్న యుద్ధానికి బాసటగా ప్రముఖ పారిశ్రామికవేత్త, అంతర్జాతీయ స్థాయిలో నెల్లూరు కీర్తిప్రతిష్టలను దశదిశలా చాటుతున్న నెల్లూరీయుడు జీవీకే రెడ్డి మళ్ళీ 2 కోట్ల రూపాయలను విరాళంగా అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇప్పటికే తమ గ్రూప్‌లోని వివిధ విభాగాల ద్వారా కరోనా బాధితుల సహాయార్థం 10 కోట్ల 50 లక్షలు అందించారు. తెలంగాణాకు 5 కోట్ల రూపాయల విలువైన పిపిఇ కిట్లు, మహారాష్ట్ర ప్రభుత్వానికి 5కోట్ల రూపాయలు, రాజస్థాన్ ప్రభుత్వానికి మరో 50 లక్షల రూపాయలు అందజేశారు. అదేవిధంగా మన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కరోనా నివారణ చర్యల కోసం ఆంధ్రప్రదేశ్ విపత్తు నివారణ సంస్థకు జీవీకే బయోసైన్సెస్ సంస్థ ద్వారా కోటి రూపాయలు, జీవీకే ఫౌండేషన్ ద్వారా మరో కోటి రూపాయలను అందజేశారు. జీవీకే రెడ్డి తనయుడు, జీవీకే ఫౌండేషన్ వైస్‌ఛైర్మన్ జి.వి.సంజయ్‌రెడ్డి ఆ భారీ విరాళాన్ని చెక్కుల రూపంలో ఈనెల 21న అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి అందజేశారు.



## కాలధర్మం

# గ్రోసు శాంతమ్మ



గత 5 దశాబ్దాలుగా నోరూరించే రుచులను అందించడంలో అగ్రగామిగా పేరుగాంచిన మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకుడు గ్రోసు గోపాలయ్య సతీమణి శ్రీమతి శాంతమ్మ మే14వతేదీ గురువారం రాత్రి (తెల్లవారితే 15) కన్నుమూశారు. 13వ తేదీ తమ ఇంట్లోని పూజగదిలో దేవుడి పటాలకు పువ్వులు పెడుతుండగా ప్రమాదవశాత్తు ఆమె చీర అంటుకోవడంతో ఆమె భగవంతుడికి కర్పూర హారతిగా మారి అసువులు బాశారు. ఆమె పేరుకు తగ్గట్టే శాంతమూర్తి, ఉదయం లేచినప్పటి నుండి భగవంతుని సేవ చేసుకుంటూ ఇంటికి వచ్చిన వారిని ఆప్యాయంగా పలకరించడం, వారికి ఆతిథ్యం ఇవ్వడం తప్ప మరో లోకమే తెలియదు. ఆమె వయస్సు 80 సంవత్సరాలు. ఈ వయసులో కూడా రోజూ యోగా చేస్తుంది, ధ్యానం చేస్తుంది. ఆధ్యాత్మికం, ఆతిథ్యం, ఆరోగ్యం తప్ప ఆమెకు వేరే ధ్యాసే ఉండదు.

ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమారుడు సుబ్బారావు, రెండవ కుమారుడు మురళీకృష్ణతో పాటు పెద్దల్లుడు హజరత్‌బాబు కూడా ఆమెకు కొడుకులాంటివాడే. చిన్న కుమార్తె, అల్లుడు బెంగుళూరులో స్థిరపడ్డారు. అను నిత్యం శాంతమ్మ చేసే పూజలు ఆ కుటుంబానికి కొండంత బలం, ఆమె హస్తవాసి, ఆశీస్సులు వారికి అండదండ. ఇంట్లోనుండి ఎవరు బయటకు వెళ్లాలన్నా ఆమె ఎదురు రావలసిందే, అలాంటి శాంతమ్మ ఆకస్మిక నిష్క్రమణతో ఆ కుటుంబం ఒక్కసారిగా శోకసముద్రంలో మునిగిపోయింది. నిత్యం శివారాధన చేసే శాంతమ్మ శివైక్యం చెందడం వారిని కలచివేసింది. తమ ఇంటి మహాలక్ష్మిని కోల్పోయి దుఃఖసాగరంలో వున్న గోపాలయ్యకి, వారి కుటుంబసభ్యులకి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ... ఆమె ఆత్మశాంతికై భగవంతుడిని ప్రార్ధిస్తోంది 'లాయర్'.

# కోర్సపాటి సీతమ్మ



కావలి నియోజకవర్గంలోనే కాకుండా జిల్లా రాజకీయాలలో కూడా కరుడుగట్టిన కాంగ్రెస్‌వాదిగా పేరుపొందిన స్వర్గీయ కోర్సపాటి గోపాలరెడ్డి సతీమణి శ్రీమతి సీతమ్మ(76) మే20వతేదీ బుధవారం రాత్రి కన్నుమూశారు. బిట్రగుంట గోపాలరెడ్డి భార్యగా తమ స్వగ్రామం కొండబిట్రగుంటలో సీతమ్మ అందరికి పెద్దదిక్కుగా ఉండేవారు. ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఒక్క కుమారుడు. రెండవ కుమార్తె, కుమారుడు అమెరికాలో స్థిరపడగా పెద్దకుమార్తె ఆఖరి కుమార్తె నెల్లూరులో స్థిరపడ్డారు. భర్త కాలం చేసిన తరువాత కూడా ఆమె గ్రామాన్ని గ్రామ ప్రజలని వదిలి రాలేదు.

ఆమె కుమారుడు కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి అమెరికాలో వున్న భారతీయ ప్రముఖులలో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు. 50వేల మందికిపైగా భారతీయులు సభ్యులుగావున్న ఇండియన్ అసోసియేషన్ అఫ్ నార్త్‌టెక్సాస్‌కి ఆయన అధ్యక్షుడిగా పనిచేశాడు. అమెరికాలో వున్న పలు తెలుగు సంఘాలతో ఆయనకు సన్నిహిత సంబంధాలు వున్నాయి. ప్రస్తుతం ఆయన నాటా కాబోయే అధ్యక్షుడిగా ఎంపికకాబడ్డారు. ఎస్వి యూనివర్సిటీ పూర్వవిద్యార్థిగా కూడా ఆయనకు మంచి స్నేహ సంబంధాలున్నాయి.

**అంత్యక్రియలు:** శ్రీధర్‌రెడ్డి అమెరికానుండి వచ్చాకే సీతమ్మ అంత్యక్రియలు చేయడానికి ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈనెల 26వ తేదికి ఆయన రావచ్చు అన్న అంచనాలతో అప్పటివరకు సీతమ్మ భౌతిక దేహాన్ని మార్చురీలో ఉంచారు. సీతమ్మ ఆత్మశాంతికై ప్రార్ధిస్తూ... శ్రీధర్‌రెడ్డికి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది లాయర్.

# ఆపద్బాంధవుడు జగన్
(మొదటి పేజీ తరువాయి)

వలస కూలీల గురించి అటు కేంద్రం, ఇటు ఆయా రాష్ట్రాలు పెద్దగా పట్టించుకోని తరుణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి వారిపట్ల చూపిన శ్రద్ధ ఆదర్శవంతమైంది. ఏపి గుండా వెళుతున్న వలస కార్మికుల ఆకలిదప్పులు తీర్చడానికి హైవేల పొడవునా పెద్దఎత్తున ఆహార శిబిరాలు ఏర్పాటు చేయడమే కాదు, వారికి పాదరక్షలు అందించడం, రాష్ట్ర సరిహద్దుల వరకు బస్సు సౌకర్యం కల్పించడం వంటి చర్యలు మానవత్వాన్ని తట్టి లేపాయి. జగన్‌లోని మానవతా కోణానికి అద్దం పట్టాయి.

# పేటలో కరోనా కాటు
(మొదటి పేజీ తరువాయి)

కోయంబేడు లింకు పాజిటివ్ కేసులు నిర్ధారణ అయిన వాళ్లందరికీ నెల్లూరు కోవిడ్ ఆసుపత్రుల్లో చికిత్సనందిస్తున్నారు. ఈ లింకు కేసులు సూళ్లూరుపేటలో ఇంకా పెరిగే అవకాశాలున్నాయి. జిల్లాలో 21వతేదీ నాటికి 201పాజిటివ్ కేసులు నమోదుకాగా 107మంది డిశ్చార్జ్ అయ్యారు. నలుగురు మృతిచెందారు. కోయంబేడు కేసులు వల్ల ఇంకొన్ని రోజులు నెల్లూరుజిల్లాకు రెడ్‌మార్క్ తప్పదు.

# పరిధులు దాటితే ప్రమాదమే!
(మొదటి పేజీ తరువాయి)

లాక్‌డౌన్‌తో అన్నీ మానుకోవాల్సి వచ్చింది. కాబట్టే ఆంక్షల సడలింపులో వాటికి వెసలుబాటు కల్పిస్తూ వచ్చారు.

### కరోనాపై భయం పోయిందా?

దేశంలో కేసులు లక్ష దాటినా కేంద్ర ప్రభుత్వం సడలింపులు పెంచుకుంటూ పోతోంది. ఇప్పటికే రైలు, రోడ్డు రవాణాకు పచ్చజెండా ఊపిన కేంద్రం, ఈ నెల 25వతేదీ నుండి విమాన సర్వీసులను కూడా ప్రారంభించబోతోంది. జూన్ మొదటివారం నుండి దేశంలో అన్ని కార్యకలాపాలు కూడా యధావిధిగా మొదలయ్యే అవకాశాలున్నాయి. కేంద్ర ప్రభుత్వం కేసులు పెరుగుతున్నా ఇంత ధైర్యంగా ముందడుగు వేయడానికి కారణం కరోనా వైరస్ ప్రభావం గురించి పూర్తిస్థాయిలో అంచనా వేయడమే! కరోనా వైరస్ అంత ప్రమాదకారి కాదని తేలింది. మిగతా వైరస్‌లతో పోలిస్తే దీనిద్వారా సగటు మరణాల రేటు తక్కువగానే వుంది. చికెన్‌గున్యా, డెంగ్యూ, మలేరియా వంటి వైరస్‌ల ద్వారానే దీనికంటే మరణాలు ఎక్కువగా వుంటున్నాయి. కాబట్టి దీని గురించి భయపడి అన్నీ మూసుకుని కూర్చుని ఆర్థికంగా నష్టపోవాల్సిన పని లేదని కేంద్రం అంచనా వేసింది. అందుకే దేశంలోని అన్ని రంగాలను మళ్లీ ట్రాక్‌లోకి వచ్చేలా పచ్చజెండా ఊపింది.

### నిబంధనలు పాటిస్తేనే...

ఆర్థిక వ్యవస్థ దెబ్బతినకూడదని కేంద్రం అన్ని రంగాలకు అనుమతులిస్తోంది. అలాగని ప్రజలు నిబంధనలు అతిక్రమిస్తే కొంప మునిగినట్లే! భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, శానిటైజేషన్, సభలు, సమూహాలకు దూరంగా వుండడం వంటివి పాటించాలి. అలాకాకుండా సడలింపులిచ్చారు కదా అని విచ్చలవిడిగా చెలరేగితే రెండు నెలలకు లక్ష దాటిన కరోనా కేసులు 10లక్షలు దాటడానికి 10రోజులు కూడా పట్టకపోవచ్చు.

### తుంగా రాజగోపాలరెడ్డి - శ్రీదేవమ్మల స్మృత్యంకంగా...

**అమెరికాలో ఉంటున్న వారి మనుమరాలు మనుమళ్ల దాతృత్వంతో**

# శ్రీ రాజరాజేశ్వరి గుడి సిబ్బందికి నెల సరుకులు పంపిణి



కరోనా కష్టకాలంలో కాలు కదలక, కడుపునిండక బాధపడుతున్నవారికి బాసటగా మేమున్నాం అంటూ అనేక మంది సహృదయంతో స్పందిస్తున్నారు. ఒక్క నెల్లూరులోనే కాకుండా విదేశాలలో ఉంటున్న నెల్లూరీయులు కూడా తమ దానగుణాన్ని చాటుకుంటున్నారు.

ఇందులో భాగంగా 'లాయర్' పత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి, వారి సతీమణి స్వర్గీయ శ్రీదేవమ్మ గార్లను స్మరించుకుంటూ అమెరికాలో ఉంటున్న వారి మనుమరాలు డాక్టర్ ప్రియదర్శినిరెడ్డి, అభిషేక్, డాక్టర్ విమల్‌రెడ్డిలు నెల్లూరు, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో పనిచేసే సుమారు 40మంది అర్చకులు మరియు ఇతర సిబ్బందితో పాటు మరో 10మంది పేద బ్రాహ్మణులకు నెలరోజులకుపైగా సరిపడా (సరుకులు) రేషన్‌ను అందజేశారు. తమ తాతయ్య, అమ్మమ్మల స్మృత్యంకంగా చేసిన ఈ కార్యక్రమాన్ని నెల్లూరులో వున్న రాజగోపాలరెడ్డి మనుమడు తుంగా శివ ప్రజీత్‌రెడ్డి, సింధూర చేతులమీదుగా నిర్వహించారు.

మే 18వ తేదీ సోమవారం ఉదయం శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది.

### జనహిత వాత్సల్యకు 250 కేజీల బియ్యం



అనాదిగా అనాధలను చేరదీస్తూ ఎందరో అభాగ్యులకు అమ్మా, నాన్నగా మారిన జనహిత - వాత్సల్య సంస్థకు 8రోజులకు సరిపడా 250 కేజీల బియ్యాన్ని తుంగా రాజగోపాల రెడ్డి - శ్రీదేవమ్మల స్మృత్యంకంగా వారి కుమార్తె మాలినిరెడ్డి గురువారం ఉదయం చేర్పించారు. అమెరికాలో ఉంటున్న ఆమె, నెల్లూరులోని తమ తమ్ముడు తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు) ద్వారా ఈ బియ్యాన్ని వాత్సల్య సంస్థ నిర్వాహకుడు సాంబశివ రావుకు అందజేసి తమ సేవాభావాన్ని చాటుకున్నారు.





మమతల తల్లి - అనురాగవల్లి

శ్రీమతి గ్రోసు శాంతమ్మ గారి

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

ఆత్మబంధువులు, ఆత్మీయులు, అభిమానులు

బంధుమిత్రులు మరియు మురళీకృష్ణ సంస్థల సిబ్బంది

# 'ప్రభా'తం

కరోనా వైరస్ అన్నది ఒకటి వస్తుందని, దానిదెబ్బకు నెలల తరబడి ప్రపంచమే స్థంభించిపోతుందని, అగ్రరాజ్యాల ఆర్థిక వ్యవస్థలు సైతం కుప్పకూలిపోతాయని ఎవరూ ఊహించలేదు. ప్రపంచమే ఒక్కసారిగా ఇంట్లో కూర్చునే పరిస్థితి వస్తుందని కాలజ్ఞానులు సైతం హెచ్చరించలేదు. కాని ఎవరూ వూహించని ఆ సంఘటన జరిగింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలింది. కరోనా వైరస్ నేపథ్యంలో దాదాపు వందకుపైగా దేశాలు లాక్‌డౌన్ విధించడం తెలిసిందే! ఒక్కో దేశంలో రెండు నెలలకుపైగా కొనసాగుతున్న లాక్‌డౌన్ మూలంగా ఆ దేశాలలో ఆర్థిక వ్యవస్థలు స్థంభించిపోయాయి. అలా ఆగిపోయిన ఆర్థిక ప్రగతి చక్రాలను మళ్ళీ పట్టాలెక్కించేందుకు అన్ని దేశాలు కూడా ప్రత్యేక ఆర్థిక ఉద్దీపనలకు శ్రీకారం చుట్టడం తెలిసిందే!

## ఊతమిచ్చేనా? ఊపిరి పోసేనా?



కేంద్ర ప్రభుత్వానికి వైరస్‌పై యుద్ధంలో అందరూ సహకరించారు. కాబట్టి ఈ యుద్ధంలో ఆర్థికంగా నష్టపోయినవారిని నిలబెట్టాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై వుంది. ఈ నేపథ్యంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోడీ దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను నిలబెట్టేందుకు 20లక్షల కోట్లతో భారీ ప్యాకేజీ ప్రకటించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఐదు విడతలుగా ఈ ప్యాకేజీ వివరాలు అందించారు. ముఖ్యంగా చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలకు ఈ ప్యాకేజీ ద్వారా పెద్ద వూరటనిచ్చారనే చెప్పవచ్చు. అలాగే వ్యవసాయ రంగానికీ ప్యాకేజీలో పెద్దపీట వేయడం ప్రశంసనీయం.

కరోనా వైరస్ మూలంగా భారతదేశం చరిత్రలో కనీవిని ఎరుగని సంక్షోభానికి గురైంది. మొత్తం నాలుగు విడతలుగా కొనసాగుతున్న లాక్‌డౌన్‌లో 70రోజుల పాటు అన్ని రకాల వ్యవస్థలు స్థంభించిపోయినట్లే! లాక్‌డౌన్ మూలంగా కొన్ని రంగాలలో తిరిగి కోలుకునే పరిస్థితి ఉంటుందేమోగాని, టూరిజం, ఆతిథ్యరంగం, వినోద పరిశ్రమలు వంటివి కోలుకోవడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుందో చెప్పలేని పరిస్థితి. దేశంలో కిళ్లీకొట్టు నుండి పెద్ద పారిశ్రామికవేత్త వరకు అందరూ ఏదో ఒక రూపంలో లాక్‌డౌన్‌తో నష్టపోయినవాళ్ళే! దేశంలో లక్షమందికి కరోనా వైరస్ రావచ్చు, లేదా 10 లక్షల మందికి కూడా పెరగవచ్చు, కాని వైరస్‌ను నియంత్రించాలని కేంద్రప్రభుత్వం తలపెట్టిన లాక్‌డౌన్ యజ్ఞంలో 130కోట్ల మంది భారతీయులు భాగస్వాములయ్యారు.

కేంద్ర ప్రభుత్వానికి వైరస్‌పై యుద్ధంలో అందరూ సహకరించారు. కాబట్టి ఈ యుద్ధంలో ఆర్థికంగా నష్టపోయినవారిని నిలబెట్టాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై వుంది. ఈ నేపథ్యంలోనే ప్రధానమంత్రి నరేంద్రమోడీ దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను నిలబెట్టేందుకు 20లక్షల కోట్లతో భారీ ప్యాకేజీ ప్రకటించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ఐదు విడతలుగా ఈ ప్యాకేజీ వివరాలు అందించారు. ముఖ్యంగా చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమలకు ఈ ప్యాకేజీ ద్వారా పెద్ద వూరటనిచ్చారనే చెప్పవచ్చు. అలాగే వ్యవసాయ రంగానికీ ప్యాకేజీలో పెద్దపీట వేయడం ప్రశంసనీయం. ముఖ్యంగా రైతులు తమ ఉత్పత్తులను ఏ రాష్ట్రంలోనైనా అమ్ముకునేలా చట్టసవరణ చేయాలనుకోవడం, ధరలు, నిల్వలపై ఆంక్షలు తొలగించడం రైతుకు శుభపరిణామమే!

ఇక ఈ ప్యాకేజీ ద్వారా ప్రైవేట్ పెట్టుబడులకు దారులు తెరిచారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించబడతాయన్నది ప్రభుత్వ ఉద్దేశ్యం. దేశంలో దెబ్బతిన్న అన్ని రంగాలను ప్రభావితం చేస్తూ కేంద్రప్రభుత్వం ప్యాకేజీకి రూపకల్పన చేసింది. ప్యాకేజీ ముసుగులో కొన్ని సంస్కరణలను కూడా ప్రవేశపెట్టింది.

అయితే కేంద్రం ప్రకటించిన ఈ ప్యాకేజీపై మార్కెట్‌లో పెద్దగా జోష్ లేదు. ప్యాకేజీలో ఎక్కడా ఉచితాలు లేవు, ఋణమాఫీలవంటివి లేవు. ఇప్పుడు అప్పు తీసుకో... వ్యాపారం చేసుకో... తిరిగి చెల్లించు అన్న ధోరణిలోనే ప్యాకేజీ వుంది. సబ్సిడీలను ఆశించేవాళ్ళు ఈ ప్యాకేజీలపై సంతృప్తిగా లేరు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు వంటి విపక్షాలు కూడా ఈ ప్యాకేజీపై పెదవి విరిచాయి. జనాల జేబుల్లోకి నేరుగా డబ్బులొస్తేనే మనకు ప్యాకేజీ బాగున్నట్లు లెక్క. అప్పు తీసుకుని తిరిగి చెల్లించమనే ఏ ప్యాకేజీ కూడా మన వాళ్లకు ఇష్టం కాదు.

కేంద్రం ప్రకటించిన ప్యాకేజీపై తెలంగాణ సీఎం కేసీఆర్ బహిరంగంగానే అసంతృప్తి వెళ్లకక్కాడు. దీనినొక బోగస్ ప్యాకేజీగా ఆయన కొట్టిపడేశాడు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అయితే కేంద్ర ప్యాకేజీ తీరుపై చిటపటలాడుతున్నారు. కొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రంతో గొడవెందుకనే ఉద్దేశ్యంతో ప్యాకేజీపై నోరు మెదపడం లేదు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వండి వార్చిన 20 లక్షల కోట్ల ప్యాకేజీపై బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు సైతం అసంతృప్తిగానే వున్నట్లు తెలుస్తోంది. కాకపోతే కడుపు చించుకుంటే మన పార్టీకే డ్యామేజీ అవుతుందని వాళ్లు ప్యాకేజీ గురించి మాట్లాడ్డం లేదు.

ముఖ్యంగా ఈ ప్యాకేజీ బ్యాంకుల చుట్టూ తిరుగుతోంది. బ్యాంకులతో ముడిపడిన కార్యక్రమాలు అంత తొందరగా పట్టాలెక్కవు. కేంద్రం ఎన్ని హామీలిచ్చినా బ్యాంకులు తమ నిబంధనలు మార్చుకుని ఉదారంగా వ్యవహరించడం లేదు. కేంద్రం ఒకటి చెబితే బ్యాంకులు ఇంకోటి చేస్తున్నాయి. కేంద్రం ప్యాకేజీ పరంగా నేరుగా వరాలివ్వకుండా బ్యాంకుల చుట్టూ లింకు పెట్టడంతోనే ప్యాకేజీ పట్ల వ్యాపార, ఇతర రంగాలలో పెద్ద జోష్ కనిపించలేదు.

అయితే ఈ ప్యాకేజీ అంతా పరిశ్రమలు, ఉద్యోగుల చుట్టూనే తిరుగుతోంది గాని, సామాన్య కూలీనాలి చేసుకు బ్రతికే వారికి ఎంత మాత్రం ఉపయోగం లేదు. సామాన్య ప్రజల్ని కనీసం ఆయా రాష్ట్రాలన్నా పట్టించుకోలేదు. కనీసం కరెంటు ఛార్జీల రాయితీలన్నా ఇచ్చుంటే ప్రజలకు ప్రత్యక్షంగా ఎంతోకొంత మేలన్నా జరిగుండేది!

## కామాక్షమ్మ హుండీ లెక్కింపు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానంలో హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని దేవస్థానం సిబ్బంది మరియు ధర్మకర్తల మండలి సభ్యులు సామాజిక దూరం పాటిస్తూ గ్లౌజులు, మాస్కులు ధరించి నిర్వహించారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని జిల్లా దేవాదాయ శాఖ అధికారి వేగూరు రవీంద్రరెడ్డి, చైర్మన్ రమేష్‌బాబు, కార్యనిర్వహణాధికారి అర్వభూమి శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. 2019 డిసెంబర్ 30 నుండి 2020 మార్చి 20 వరకు 81రోజులకు గాను ప్రధాన ఆలయం హుండీల ద్వారా రూ. 13,36,976/-, అన్నదానం హుండీ ద్వారా రూ. 1,23,655/- రాబడి వచ్చింది. అలాగే బంగారం 74 గ్రాముల 900 మిల్లిగ్రాములు, వెండి 374 గ్రాములు భక్తులు కానుకలుగా సమర్పించారు.

## వలస కూలీలను ఆదుకుంటున్న దాతలు

కాలినడకన తమ స్వస్థలాలకు వెళ్తున్న వేలాదిమంది వలస కూలీలకు జిల్లాలో ఆయా ప్రాంతాల్లోని దాతలు తమవంతు సాయం అందజేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారిపై వలస కూలీలకు ఈనెల 15న బుస్సారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం, రాత్రి వేళల్లో ఆహారపొట్లాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయన వెంట దాతలు మారంరెడ్డి సుబ్బారెడ్డి, సోమిశెట్టి సాయి కృష్ణ, శరత్‌చంద్రారెడ్డి, పుచ్చకాయల రాజేష్ తదితరులున్నారు.

అదేవిధంగా తమిళనాడు నుంచి పొరుగు రాష్ట్రాలకు వలస వెళుతున్న కార్మికులకు తడ సమీపంలో వైయస్సార్సీపి బిసి సెల్ మండల అధ్యక్షుడు ఉచ్చూరు మునుస్వామిరెడ్డి సమకూర్చిన ఆహారాన్ని వైయస్సార్సీపి మండల అధ్యక్షుడు కొళవి రఘురెడ్డి ఆధ్వర్యంలో వలస కూలీలకు అందజేశారు.

## వలస కార్మికులపై దృష్టిపెట్టి వుండాలి

లాక్‌డౌన్ ఉద్దేశ్యం ఎక్కడివాళ్లను అక్కడ ఆగిపోమ్మని, ఇలా స్థంభింపచేయడం ద్వారానే కరోనా వైరస్‌ను కట్టడి చేయగలం. కాని వలస కార్మికుల విషయంలో ప్రభుత్వ ఉద్దేశ్యం నీరుగారింది. కేంద్ర, రాష్ట్రాల మధ్య వలస కార్మికులకు ఏర్పాట్ల విషయంలో సమన్వయం లేకపోవడం వల్ల వారికి సరైన ఏర్పాట్లు చేయలేక పోయారు. దీంతో వలస కార్మికులు వేల కిలోమీటర్లు నడిచి తమ సొంతూర్లకు పయనం కావడం, ఆకలి దప్పులకు అలమటించడం, కొందరు మార్గమధ్యంలోనే మరణించడం జరిగింది. వలస కార్మికులు ఇలా ఇళ్లబాట పట్టకుండా ఎక్కడికక్కడ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే వారి తిండి తిప్పలు, వసతి కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసుంటే బాగుండేది!

– బచ్చుల కృష్ణ, విజయవాడ.

## జగన్ నిర్ణయం భేష్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రపరిధి గుండా వెళ్లే వలస కార్మికులకు వసతులు సమకూర్చాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతైనా అభినందనీయం. చాలా రాష్ట్రాలు వలస కార్మికులను గాలికొదిలేశాయి. కాని, తన రాష్ట్ర ప్రజలు కానప్పటికీ, వారి ఓట్లతో తనకు అవసరం లేనప్పటికీ జగన్మోహన్‌రెడ్డి వలస కూలీల బాధలు చూసి మానవత్వంతో స్పందించారు. రాష్ట్ర పరిధిలో వారికి దారి పొడవునా ఆహారం, నీళ్లు, పాదరక్షలు వంటివి అందించడంతో పాటు వాహన వసతి కూడా కల్పించడం ఎంతో మంచి పరిణామం.

చక్కా లెనిన్‌బాబు, నెల్లూరు.

## అర్థంకాని ప్యాకేజీ




కరోనా వైరస్... లాక్‌డౌన్ నేపథ్యంలో దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం 20లక్షల కోట్ల రూపాయల భారీ ప్యాకేజీ ప్రకటించింది. అయితే ఈ ప్యాకేజీ గురించి సామాన్యులకు అర్థం కావడం లేదు. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజలకు ఎటువంటి ఊరడింపులు లేవు. లాక్‌డౌన్ మూలంగా ప్రధానంగా దెబ్బతింది టూరిజం, ఆతిథ్యం, వినోదం వంటి రంగాలు. ఆ రంగాలకు స్వాంతన చేకూర్చే ప్రయత్నమే ఈ ప్యాకేజీలో లేదు. వలస కూలీల సొంత ఊర్ల బాటతో నిర్మాణ రంగం కూడా స్థంభించింది. ఈ రంగానికి కూడా ఎలాంటి ప్రోత్సాహం లేదు.

– దూడల మల్లి, నెల్లూరు.



# ప్రగతి 'చక్రం' గాడినపడేనా?

**ఆర్టీసీ!... తుఫానొచ్చినా, వరదొచ్చినా, రాజకీయ పార్టీలకు కోపమొచ్చి బంద్‌లు చేసినా, ఆందోళనలు చేలరేగినప్పుడు అల్లరి మూకలు స్వైర విహారం చేసినా... తొలి నష్టం ఆర్టీసీకే! బంద్‌ల మూలంగా, విధ్వంసాల మూలంగా ఆర్టీసీ వందల కోట్ల నష్టాలను చవిచూడాల్సివచ్చింది. ఎన్ని కష్టాలు, నష్టాలు ఎదురైనా తట్టుకుని నిలబడుతూ సామాన్య ప్రయాణీకుడిని గమ్యస్థానం చేర్చుడానికి తోడ్పడుతూనే వుంది. పేద, మధ్య తరగతి ప్రయాణీకుల "ఆడి" కారు ఆర్టీసీ బస్సే!**

అలాంటి ఆర్టీసీ బస్సుకు మరోసారి కష్టాలు, నష్టాలొచ్చిపడ్డాయి. కరోనా వైరస్ నేపథ్యంలో సుధీర్ఘ లాక్‌డౌన్ మూలంగా ఆర్టీసీ భారీ నష్టాలపాలైంది. రెండు నెలలుగా ఆర్టీసీ సేవలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు నడుస్తున్నప్పుడే సంస్థ నష్టాల్లో వుంది. ఇప్పుడు బస్సులు నడవడం లేదు, వచ్చే ఆదాయం లేదు, రెండు నెలలు కార్మికులకు జీతం ఇవ్వాల్సిందే! ఈ నెల 21నుండి బస్సులు తిరగడం మొదలైనా ఈ లాక్‌డౌన్ రోజుల్లో కోల్పోయిన ఆదాయం రికవరీ అయ్యే పరిస్థితి లేదు. నెల్లూరుజిల్లా పరిధిలో 10 ఆర్టీసీ డిపోలున్నాయి. ఆయా డిపోల బస్సులన్నీ ఎక్కడికక్కడ నిలిచివున్నాయి. లాక్‌డౌన్ తర్వాత నిర్ధిష్ట సూచనలతో పూర్తిస్థాయిలో బస్సులు నడపడానికి ఆర్టీసీ సమాయత్తమవుతోంది. సామాజిక దూరం విధానాన్ని బస్సుల్లోనూ అమలు చేయబోతున్నారు. దీనికోసం సీట్ల సంఖ్యను కుదించారు. సూపర్‌లగ్జరీ బస్సులో 36 సీట్లను 24కు తగ్గించారు. అల్ట్రాడీలక్స్‌లో 40సీట్లను 27 సీట్లకు, ఎక్స్‌ప్రెస్‌లలో 50 సీట్లను 30 సీట్లకు, పల్లెవెలుగు బస్సుల్లో 60సీట్లను 36 సీట్లకు కుదించారు. కరోనా వైరస్ దారిలోపడి జనజీవనం సాధారణ స్థితికి చేరేదాకా ఆర్టీసీ ఆంక్షల ప్రయాణం తప్పదు. మరి పూర్తిస్థాయి సీట్లతో నడిచేటప్పుడే నష్టాల్లో వున్న ఆర్టీసీ, ఇప్పుడు అరకొర సీట్లతో నడుస్తోంది. ఈ సంక్షోభాన్ని తట్టుకుని ఎలా మనుగడ సాగిస్తుందో చూడాలి!?

# ట్రంప్ ప్రశంసలందుకున్న తెలుగుబిడ్డ



## శ్వేతసౌధంలో శ్రావ్యకు అభినందనలు

సేవ చేయాలనే సంకల్పం ఉండాలే కానీ చేయగలిగినంత సాయం ఎవరైనా చేయవచ్చు. గోరంత సాయం కూడా ఒక్కోసారి కొండంతగా ఉపయోగపడుతుంది. అలా సేవకు వయసుతో కూడా నిమిత్తం లేదని నిరూపిస్తూ పదేళ్ళ బాలిక అత్యున్నతమైన గౌరవాన్ని అందుకుంది. ఏకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచే ప్రశంసలు పొందింది. అమెరికాలో కరోనా వైరస్‌పై పోరాడుతున్న వైద్యులు, ఆరోగ్యకార్యకర్తలు అహర్నిశలు కరోనాతో పోరాడుతున్న ప్రస్తుత తరుణంలో వారికి తనవంతు ఉడతా భక్తి సాయంగా కుకీస్ పంచిపెట్టింది.. శ్రావ్య అన్నపరెడ్డి అనే పదేళ్ళ బాలిక. ఆ బాలిక చేస్తున్న సేవలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముగ్ధుడై శ్రావ్యను ఈనెల 18న అమెరికాలోని అత్యున్నతమైన వైట్‌హౌస్ (శ్వేతభవనం)కు ఆహ్వానించి మరీ అభినందించారు. ఈమెది మన రాష్ట్రమే. మన రాష్ట్రంలోని గుంటూరుజిల్లా బాపట్ల మండలంలోని నరసాయపాళెం గ్రామానికి చెందిన శ్రావ్య తల్లిదండ్రులు సీతా కలామ్; విజయరెడ్డి అన్నపురెడ్డిలు ఎంతోకాలంగా అమెరికాలో వైద్యులుగా స్థిరపడ్డారు. అమెరికాలోని మేరీలాండ్ రాష్ట్రంలోని హనోవెర్ హిల్స్ ఎలిమెంటరీ స్కూల్‌లో ఫోర్త్ గ్రేడ్ చదువుతున్న శ్రావ్య బాలికల 744 స్కౌట్స్‌గ్రూప్ సభ్యురాలు. కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు, నర్సులకు శ్రావ్య స్వయంగా కుకీలు చేసి వారికి అందించింది. అలాగే వారికి అభినందనలు తెలియజేస్తూ గ్రీటింగ్ కార్డులు రూపొందించి అందజేసింది. శ్రావ్య సేవలను మెచ్చుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, శ్రావ్యకు ప్రశంసాపత్రం కూడా బహుకరించారు.

## మానవత్వం లేని..

# మటన్ మాఫియా

- మాంసంతో మోసపు వ్యాపారం.. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- గోడౌన్లలో టన్నుల కొద్దీ.. కుళ్లి, పురుగులు పట్టిన పశు మాంసం
- నెల్లూరులో పెరిగిపోతున్న కల్తీ విక్రయాలు.. హడలెత్తిపోతున్న ప్రజలు



కుళ్ళిన మాంసాన్ని ప్రొక్లెయిన్‌తో తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

*నెల్లూరులో మటన్ మాఫియా పేట్రేగిపోతోంది. అధికారులు ఎంతగా దాడులు చేస్తున్నా ఈ అక్రమ వ్యాపారులు ఏమాత్రం భయపడడం లేదు. కనీసం మానవత్వం కూడా లేకుండా కేవలం డబ్బు కోసం కక్కుర్తిపడుతూ, పురుగులు పట్టిన మాంసాన్ని సైతం టన్నుల కొద్దీ నిల్వచేసి, అత్యంత దుర్గంధంతో ఉండే ఆ మాంసాన్ని గుట్టుచప్పుడు కాకుండా మాంసంలో కలిపి కల్తీచేసి అమ్మేస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. నెల్లూరుజిల్లాలో ఇలాంటి పురుగులు పట్టి గబ్బుకొట్టిపోతున్న మాంసం నిల్వలు గతంలో పలుచోట్ల పట్టుకున్నా, ఇప్పుడు మళ్ళీ ఈ నెల16వ భారీస్థాయిలో మాంసం కల్తీ విషయం బయటపడడంతో మాంసం అంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.*

అసలే కరోనా మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను వణికిస్తోంది. ఆ భయంకర వ్యాధి వ్యాప్తి జరగకుండా ప్రభుత్వాలు పెద్దఎత్తున చర్యలు తీసుకుంటున్నాయి. ఏ ఒక్కరికి ఏమాత్రం అనారోగ్యం కలిగినా వెంటనే వైద్యపరీక్షలు చేయించి అప్రమత్తంగా ఉండాలంటున్నాయి. అయితే నెల్లూరులోని అక్రమవ్యాపారులకు ఇలాంటివేమీ లెక్కలేదు. ఎవరు ఏ జబ్బు వచ్చి చచ్చినా వారికేమీ బెంగ లేదు. పురుగులు పట్టిన మాంసాన్నయినా సరే.. టన్నుల లెక్కన దాచిపెట్టి దానిని మంచిమాంసం అన్నట్లుగానే నమ్మబలికి అమ్మేస్తుంటారు. వాటిలో ఎన్ని రకాల ఘోరమైన వైరస్‌లుంటాయో తెలియదు. అవి తిన్నవారు ఎన్ని బాధలు పడుతుంటారో వారికి అక్కర్లేదు. ఆ కల్తీ వ్యాపారమే వారికి కాసులు పండిస్తోంది. ఏళ్ళ తరబడి గుట్టుచప్పుడు కాకుండా ఈ మోసపు వ్యాపారం యధేచ్ఛగా సాగిపోతూనే ఉంది. ఈ మటన్ మాఫియాపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి గతంలో దాడులు చేసినా, మళ్ళీ కొద్ది రోజుల్లోనే మరోచోట ఈ వ్యాపారం మరింత భారీగా జరుగుతున్నట్లు తెలుస్తుండడంతో జిల్లా ప్రజలు హడలిపోతున్నారు. అధికారులు ఎన్నిసార్లు దాడులు చేసినా, ఎంత పెద్దమొత్తంలో జరిమానాలు విధించినా అక్రమార్కులెవరూ వాటిని ఖాతరుచేయడం లేదు. కొద్దిరోజులు కల్తీ వ్యాపారం చేస్తే చాలు.. అంతకు మించి సంపాదించుకోవచ్చనే ఆలోచనతో మళ్ళీ ఈ మోసాలకే పాల్పడుతూ ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారు. టన్నులకొద్దీ మాంసాన్ని ఫ్రిజ్‌లలో నిల్వ చేసి, అదంతా కుళ్ళిపోయి పురుగులు పట్టి దుర్వాసన వస్తూ పరమ జుగుప్సాకరమైన రీతిలో ఉన్నా సరే, దానిని యదేచ్ఛగా అమ్మేసుకుంటూ డబ్బు సంపాదించుకునే కక్కుర్తి వ్యాపారులు నెల్లూరులో పెరిగిపోయారు.

### ఆవులు, బర్రెల మాంసంతో కలిపి అమ్మేస్తున్నారు

నెల్లూరు నగరంలోని బోడిగాడితోట సమీపంలో పెద్దఎత్తున బర్రెలు, ఆవుల మాంసాన్ని దాచిపెట్టి విక్రయిస్తున్నారనే సమాచారం అందుకున్న నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి పిడుగు వెంకటరమణ వెంటనే ఆ ప్రాంతానికి వెళ్ళి ఆకస్మిక దాడులు నిర్వహించారు. అక్రమ వ్యాపారులు ఆ ప్రాంతంలో భారీ గోడౌన్లు ఏర్పాటుచేసుకుని ఆవులు, గేదెల మాంసాన్ని పొట్టేలు, మేక మాంసాల్లో కలిపి కల్తీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. సుమారు ఒకటిన్నర టన్నుల మాంసం డీప్ ఫ్రిజ్‌లలో దాచి ఉంచుకున్న విషయం బయటపడింది. ఆ కుళ్లిపోయిన మాంసంతో పాటు, మరో 6 టన్నుల చర్మం, పశువుల కళేబరాలు, ఎముకలను కూడా చూసి అధికారులు విస్తుపోయారు. ఆ పశు కళేబరాలతో అక్రమ వ్యాపారులు నూనెను తయారు చేస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది.

అధికారులు అక్కడికి రాగానే అక్రమవ్యాపారులు వారిపై దాడులు చేయడానికి కూడా తెగబడినట్లు సమాచారం. అయినా, అధికారులు భయపడకుండా జేసిబీలతో ఆ గోడౌన్లను పగులగొట్టించి, వాటి లోపల మురిగిపోయి, దుర్గంధ భరితంగా వున్న మాంసాన్నంతా స్వాధీనం చేసుకుని అక్కడనుంచి తొలగించడంతో చుట్టుపక్కల ఉన్న ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. మాంసం నిల్వ చేసి, కల్తీ చేసి విక్రయాలకు పాల్పడుతున్న వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామని, ఇలాంటి అక్రమాలు ఎక్కడైనా జరుగుతున్నట్టు ఎవరికి తెలిసినా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఆరోగ్యశాఖ అధికారి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




## క్యాన్సర్ బాధితురాలికి
# విపిఆర్ చేయూత



మానవతావాది రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన గొప్ప వ్యక్తిత్వాన్ని మరో సారి చాటుకున్నారు. క్యాన్సర్ వ్యాధిగ్రస్తురాలి చికిత్స కోసం ప్రధానమంత్రి జాతీయ సహాయనిధి నుండి 3లక్షల రూపాయలు మంజూరు చేయించి ఆమెకు అండగా నిలిచారు. తమిళనాడు రాష్ట్రంలోని తిరువత్తూరుకు చెందిన శ్రీమతి రేవతి జయకుమార్ గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఆమె సమస్య తన దృష్టికి రాగానే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆమె చికిత్స నిమిత్తం సాయం కోరుతూ ప్రధానమంత్రికి లేఖ వ్రాశారు. ప్రధానమంత్రి కార్యాలయం వెంటనే స్పందించి బాధిత మహిళకు 3లక్షల రూపాయలు మంజూరు చేసింది. ఆపత్కాలంలో తనకు చేసిన సాయానికిగాను ఆ మహిళ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపింది.

## ప్రభుత్వ కార్యాలయాల
# తలుపులు తెరిచారు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 21వ తేదీ నుండి ప్రభుత్వ కార్యాలయాలన్నీ తెరచుకున్నాయి. కరోనా మూలంగా రెండు నెలలుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. పోలీసులు, వైద్యులు, పారిశ్రామిక సిబ్బంది, విద్యుత్ శాఖలు నిరంతరం పనిచేస్తున్నాయి. 21వ తేదీ నుండి ప్రభుత్వ కార్యాలయాలను తెరచి పూర్తి స్థాయిలో విధులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో కార్యాలయాలు తెరవబడ్డాయి. అయితే శానిటేషన్, మాస్కులు, భౌతిక దూరం వంటి వాటిని కార్యాలయాలలో తప్పనిసరి చేశారు. గర్భిణులకు, వయసుపైబడి తీవ్ర ఆరోగ్య సమస్యలున్న వారికి ఇంటి నుండే పనిచేసే వెసులుబాటు కల్పించారు. విధుల్లోకి వచ్చే ముందు ప్రతి ఉద్యోగిని థర్మల్ స్క్రీనింగ్ ద్వారా పరీక్షిస్తున్నారు. జ్వరం, జలుబు వున్న వారిని సెలవుమీద పంపిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు పిటిషనర్లను అనుమతించడం లేదు. ప్రస్తుతానికి స్పందన కార్యక్రమం ద్వారానే ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించనున్నారు.

## నేతన్నలకు
# నిత్యావసర సరుకులు

లాక్‌డౌన్ నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న అనేకమంది చేనేత కార్మికులకు ఈనెల 15న నెల్లూరులో ఏపి వెల్ఫేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శేషయ్య, జిల్లా శాఖ అధ్యక్షుడు సురేష్ తదితరుల ఆధ్వర్యంలో 18 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు. 4 లక్షల రూపాయలు విలువజేసే సరుకులను కష్టాల్లో ఉన్న నేతన్నలకు తమవంతు సహాయంగా అందించినట్లు వారు పేర్కొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## ప్రమాద బాధితులకు
# అండగా నిలిచిన అనిల్

రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్‌కు తరచూ యాక్సిడెంట్ సంఘటనలు తగులుతున్నాయి. మంత్రి అయిన కొత్తల్లో ఆయన విజయవాడ వెళుతుండగా ఒంగోలు వద్ద హైవేపై ఒక యాక్సిడెంట్ జరగడం, ఆయన కాన్వాయ్ ఆపి బాధితులను దగ్గరుండి ఆసుపత్రికి పంపడం తెలిసిందే!

నిన్న 21వ తేదీ గురువారం ఉదయం కూడా గుంటూరు జిల్లా పొత్తూరు వద్ద హైవేపై ఇలాంటి సంఘటనే జరిగింది. తమిళనాడు నుండి ఆంధ్ర వలసకూలీలను వదిలిపెట్టి విజయవాడ నుండి చెన్నై వైపు వస్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్, కండక్టర్లు తీవ్రంగా గాయపడ్డారు. అప్పుడే విజయవాడ నుండి నెల్లూరు వస్తున్న మంత్రి అనిల్ ప్రమాద దృశ్యాన్ని చూసి తన కాన్వాయ్‌ని ఆపాడు. బాధితులను మరో బస్సులో ఆసుపత్రికి తరలించాడు. మంత్రి చొరవతో ఆ బాధితులకు సరైన సమయంలో వైద్యచికిత్స దొరికినట్లైంది.

# నెల్లూరులోనే కరోనా ల్యాబ్



కరోనా పాజిటివ్ కేసుల నిర్ధారణ పరీక్షలు ఇక నెల్లూరులోనే జరుగనున్నాయి. దీనికి సంబంధించిన వైరాలజీ ల్యాబ్‌ను ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేశారు. 19వ తేదీ ఇక్కడ పరీక్షలు నిర్వహించి, వాటికి తిరిగి తిరుపతి ల్యాబ్‌లో కూడా పరీక్షించగా ఒకే విధంగా ఫలితాలు వచ్చాయి. దీంతో కరోనా పరీక్షలు నెల్లూరులోనే నిర్వహించడం మొదలైంది.

ఇప్పటిదాకా కరోనా నిర్ధారణ కోసం నమూనాలను తిరుపతికి పంపిస్తూ వచ్చారు. దీనివల్ల ఫలితాలు రావడానికి రెండు, మూడు రోజులు పట్టేది. కరోనా పాజిటివ్ వచ్చిన వాళ్ళ కాంటాక్ట్‌లను క్వారంటైన్ చేయడం చాలా ఆలస్యమయ్యేది. దీనివల్లే కేసులు పెరిగాయి కూడా! ఇప్పుడు కరోనా పరీక్షల ఫలితాలు వెంటనే వచ్చే అవకాశముండడం వల్ల కాంటాక్ట్ కేసులు క్వారంటైన్ కూడా సులభమవుతుంది.

## ఆగస్టు 3న
# తెరుచుకోనున్న బళ్ళు

లాక్‌డౌన్‌తో మూతపడ్డ పాఠశాలలు ఆగస్టు 3వతేదీ తెరచుకోబోతున్నాయి. పాఠశాలలు మూతపడి రెండు నెలలు దాటింది. జూన్, జూలైలలో కూడా పాఠశాలలకు పూర్తిగా సెలవలే! సాధారణంగా అయితే జూన్ 12, 13 తేదీలలో పాఠశాలలు పునఃప్రారంభమవుతుంటాయి. కరోనా దెబ్బకు ఈసారి 2 నెలలు అదనంగా పిల్లలకు సెలవులిచ్చినట్లయ్యింది.



# కరోనా యుద్ధానికి డీసీసీబీ విరాళం

కరోనాపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సమరానికి వెన్నుదన్నుగా నిలుస్తూ నెల్లూరుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులు ఒకరోజు వేతనాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా అందజేశారు. ఇటీవల నెల్లూరు ఇస్కాన్‌సిటీలోని రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ద్వారా ఈ విరాళం 30లక్షల రూపాయల చెక్కును జిల్లా కేంద్ర సహకారబ్యాంకు ఛైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ఎం.వి. శేషగిరిబాబుకు అందజేశారు.

# డైనింగ్ హాల్‌కు ప్రణాళికలు

నగర పాలక సంస్థ కార్యాలయం సిబ్బందికి భోజన విరామ గది ఏర్పాటుకు ప్రణాళికను సిద్ధం చేయాలని కమిషనర్ టి.బాపిరెడ్డి అధికారులను ఆదేశించారు. కార్యాలయంలో అన్ని విభాగాలను ఆయన శనివారం పరిశీలించి సిబ్బంది పనితీరును సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విశాలమైన ఐదవ అంతస్తులో భోజన విరామ కేంద్రం ఏర్పాటు చేస్తే సిబ్బందికి సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నామన్నారు. కార్యాలయంలోని అన్ని విభాగాలతో పాటు పార్కింగ్, క్రీడా మైదానం తదితర ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉండేలా అనునిత్యం పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులకు కమిషనర్ సూచించారు.

# ఆగస్టు 3 నుంచి డీఎడ్ పరీక్షలు

డీఎడ్ చదువుతున్న 2018-20 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థులకు ఆగస్ట్3 నుంచి 8వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో ప్రభుత్వ డీఎడ్ కళాశాల ఒకటి, ప్రైవేట్ కళాశాలలు 24 ఉన్నాయి. ఈ కళాశాలల నుంచి 1250 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

## 30లోపు ఆస్తి పన్నులను చెల్లిస్తే
# 5 శాతం రాయితీ

నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లోని ఇంటి పన్ను, కుళాయి పన్నులను ఈనెల 30లోగా చెల్లిస్తే 5 శాతం రాయితీని ఇవ్వనున్నట్లు నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# కరోనాను జయించిన చిన్నారి

నెల్లూరులోని కోటమిట్ట ప్రాంతానికి చెందిన 9 నెలల పసికందు కరోనాను జయించింది. కరోనా వ్యాధితో ఆ చిన్నారి నెల్లూరులోని నారాయణ కోవిడ్ ఆసుపత్రిలో గత కొన్ని రోజులుగా చికిత్స పొందుతోంది. ఆ చిన్నారి విజయవంతంగా కరోనా నుంచి కోలుకుందని ఆసుపత్రి నోడల్ అధికారి సుబ్బారావు తెలియజేశారు.

## ప్రైవేట్ టీచర్లను
# యాజమాన్యాలు ఆదుకోవాలి



కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు మూతబడడంతో ఆ పాఠశాలల్లో పనిచేసే సిబ్బంది, ఉపాధ్యాయుల కుటుంబాలు ఆర్థికంగా మానసికంగా చితికిపోతున్నారని, వెంటనే తమను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ టీచర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ నెల్లూరుశాఖ కార్యదర్శి టి.గౌరీ శంకర్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అపారమని, అలాంటి ఉపాధ్యాయులు ఇప్పుడు విపత్కర పరిస్థితుల్లో ఉన్నారని, ఆయా సంస్థల యాజమాన్యాలు వెంటనే ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు.

## వలస కూలీలకు
# విఎస్‌యు ఆహార పంపిణీ



విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంవారు జాతీయ సేవాపథకంలో భాగంగా వలస కూలీలకు ఉచిత ఆహారం మరియు మంచినీటి పంపిణీ నిర్వహించారు. దూర ప్రాంతాలకు జిల్లా మీదుగా సైకిల్ మీద అలాగే కాలినడకన వెళుతున్న వలసకూలీల సహాయార్థం ఉచిత ఆహార మరియు మంచినీళ్ళ పంపిణీ శిబిరాన్ని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. యల్.విజయకృష్ణారెడ్డి ప్రారంభించారు.

రిజిస్ట్రార్ డా. విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉపకులపతి ఆచార్య ఆర్.సుదర్శనరావు ఆదేశానుసారం, జిల్లా అధికారుల అనుమతితో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని అన్నారు.

## శ్రీసిటీ పోలీసులకు
# అనంతపురం డిఐజి ప్రశంస



అనంతపురం రేంజ్ డిఐజి కాంతి రానా టాటా ఈనెల 17న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు సాదర స్వాగతం పలికారు. సత్యవేడు, వరదయ్యపాళెం మండలాల్లో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పరిశీలనకు వచ్చిన డిఐజి శ్రీసిటీని కూడా సందర్శించారు.

కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించడానికి, శ్రీసిటీని కరోనా రహిత జోన్‌గా ఉంచడానికి తీసుకుంటున్న చర్యలను ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి డిఐజికి వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ పోలీసుల సేవలను డిఐజి కొనియాడారు. శ్రీసిటీ చుట్టుపక్కల రెడ్‌జోన్ మండలాలు ఉన్నప్పటికీ శ్రీసిటీని గ్రీన్‌జోన్‌గా నిలుపుకుంటున్న శ్రీసిటీ పారిశ్రామిక వాటాదారుల కృషి అభినందనీయమని డిఐజి అన్నారు. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను ఆయన వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎస్పీ సెంథిల్‌కుమార్, అదనపు ఎస్పీ రిశాంత్‌రెడ్డి, శ్రీసిటీ డిఎస్పీ కమలకుమారి, పుత్తూరు డిఎస్పీ మురళీధర్, శ్రీసిటీ సిఐలు జగదీష్ నాయక్, అశోక్‌కుమార్‌తో పాటు రెవెన్యూశాఖ అధికారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛందంగా..
# కరోనా పరీక్షలు చేయించుకోండి

**- మంత్రి డా. అనిల్‌కుమార్‌యాదవ్**



ఎవరికైనా కరోనా వ్యాధి లక్షణాలు ఉన్నట్లు అనుమానం ఉంటే..వారు స్వచ్ఛందంగా కరోనా పరీక్షలు చేయించుకోవాలని, అధికారయంత్రాంగానికి ఆ విషయం తెలియజేసి వైద్యపరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ కోరారు. ఈనెల 15న ఆయన నెల్లూరు నగరంలో రెడ్‌జోన్‌గా ఉన్న స్టోన్‌హౌస్‌పేటలో పర్యటించి అధికారులు ప్రజలకు అందిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. కరోనా వల్ల వచ్చిన ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ ఆదేశాలతో అధికారయంత్రాంగమంతా కరోనా నివారణకు గట్టి చర్యలు తీసుకుంటోందన్నారు. వైద్యసిబ్బందితో పాటు పోలీసులు, వార్డుల వలంటీర్లు, కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది తదితరులంతా కరోనా నిరోధానికి చేస్తున్న కృషిని మంత్రి ఈ సందర్భంగా ప్రశంసించారు. కరోనా నివారణలో అధికారులకు ప్రజలు బాగా సహకరిస్తున్నారంటూ ఆయన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైయస్సార్‌కాంగ్రెస్ పార్టీ నాయకులు ముక్కాల ద్వారకానాథ్, రూప్‌కుమార్‌యాదవ్, సన్నపురెడ్డి పెంచలరెడ్డి పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా నిరోధానికి
# కట్టుదిట్టమైన చర్యలు

**- జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్**



ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, అందుకనుగుణంగా ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోతో అన్ని విభాగాలు కలసి పనిచేయాలని జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ సూచించారు. ఈనెల 16న నెల్లూరులోని జిల్లా పోలీస్‌కార్యాలయంలో ఏర్పాటుచేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని ఇసుక రీచ్‌లు, స్టాక్‌యార్డ్‌ల వద్ద సిసికెమెరాలతో నిఘా ఏర్పాటుచేయాలని, అన్ని ఇసుకరీచ్‌లలో వేబ్రిడ్జి, ఇసుక సరఫరా చేసే ప్రతి వాహనానికి జిపిఎస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఒక మొబైల్ బృందాన్ని ఆకస్మిక తనిఖీలకు ఏర్పాటుచేయాలని సూచించారు. అదేవిధంగా, అక్రమ మద్యం తయారీని పూర్తిస్థాయిలో అరికట్టాలని, మద్యం దుకాణాలను నెలకు కనీసం రెండు మూడుసార్లయినా ఆకస్మిక తనిఖీలు చేసి అక్రమాలను నిరోధించాలని జిల్లా ఎస్పీ చెప్పారు.

ఈ సమావేశంలో జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారి శ్రీధర్‌రావు, మైనింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహన్, ఎక్సైజ్ డెప్యూటీ కమిషనర్ వి.రాధయ్య, ఎస్‌బి డిఎస్పీ కోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# సంస్మరణ

మా అభ్యున్నతికి కారకులు, మాకు స్ఫూర్తిప్రదాతలు
బంధుజనప్రియులు, సమతావాది

## పూండ్ల చెంచురెడ్డి గారు

పరమపదించి తేది. 27.05.20 నాటికి
ముప్పైరెండు సంవత్సరాలు నిండుతాయి.

**ఆ పుణ్యమూర్తిని సంస్మరించుకొంటూ...**

భార్య :
**పూండ్ల కామేశ్వరమ్మ**

కుమారులు :
**డా॥ పూండ్ల శ్రీనివాసులురెడ్డి**
**పూండ్ల వెంకురెడ్డి**

మరియు
**కుటుంబసభ్యులు**

# గూడూరు డివిజన్ వార్తలు

## ఆకలి తీర్చిన ప్రగతి సేవ



గూడూరు ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో ఎల్‌పిపి స్కూల్ కరెస్పాండెంట్ బుస్సారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి సహకారంతో ఈనెల 18న 80 మంది వలస కూలీలకు భోజన సదుపాయం సమకూర్చారు. ఎమ్మార్వో లీలారాణి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించారు. సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, బాలయ్యనాయుడు, రవికుమార్, గ్రానైట్ ప్రభాకర్, ప్రజేందర్‌రెడ్డి, కరిముల్లా, సివిఆర్ న్యూస్ సతీష్, టెన్ టీవీ ప్రభుదాస్, మినీ గురుకుల సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ మానవీయ సేవలు



వలస కూలీలకు భోజనం పంపిణీ చేస్తున్న రమేష్

గూడూరులోని 27వ వార్డు మాజీకౌన్సిలర్ బాలి బోయిన రమేష్ దాతృత్వంతో ఇటీవల గూడూరు జాతీయ రహదారిపై నడుచుకుంటూ దూరప్రాంతాల నుంచి చత్తీస్‌గఢ్‌లోని తమ స్వస్థలాలకు వెళ్తున్న సుమారు 200 మంది వలసకూలీలకు అన్నం ప్యాకెట్లు, అరటిపండ్లు, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోదండయ్య, లోకేష్, చిన్న, శ్రీహరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వంతో సేవలు



కరోనా, లాక్‌డౌన్‌ల కారణంగా పరిశ్రమలు మూతపడదంతో పనులు లేక స్వస్థలాలకు వెళ్ళిపోయేందుకు రవాణా సౌకర్యం లేక గుమ్మిడిపూడి నుంచి బీహార్‌కు సైకిళ్ళపై వెళ్తున్న ఏడుగురు మహిళలు, 15 మంది పురుషులకు ఎస్‌కెఎస్ మెడికల్స్ సుభాన్, వారి మిత్రులతో కలిసి ఈనెల 18న అన్నం ప్యాకెట్లు, బ్రెడ్లు, ఓఆర్ఎస్ ద్రావణం, వాటర్‌బాటిల్స్‌ను ఉచితంగా అందజేశారు. సుభాన్‌తో పాటు పి.చంద్ర మోహన్, మాజ్ అహ్మద్‌లు పాల్గొన్నారు.



ఈ నెల 17న గూడూరు మండలం, నెల్లటూరు, చవటపాలెం గిరిజన కాలనీలో 250మందికి భోజనం పంపిణీ చేస్తున్న లయన్ యర్రాబత్తిన గురునాథం తదితరులు



## ఇన్నర్‌వీల్ క్లబ్ సాయం

గూడూరు మండలం పురిటిపాళెం సమీపంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల బస్‌స్టాప్ సమీపంలో జాతీయరహదారిపై ప్రయాణిస్తున్న వలస కూలీలకు ఈనెల 17న ఇన్నర్‌వీల్ సభ్యులు శైలజ, అనిత దాతృత్వంతో ఆహారం అందజేశారు. దీంతోపాటు, డాక్టర్ రోహిణి గూడూరు సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో మాట్లాడి శ్రీకాకుళం వెళ్ళే వలస కూలీలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ చెరుకూరు రోహిణి, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు మల్లాబత్తిన జీవనిరెడ్డి, సుప్రియ, విష్ణువందన, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్లకు నిత్యావసరాలు



ఫోటోగ్రాఫర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పాశం సునీల్‌కుమార్, బిల్లు చెంచురామయ్య తదితరులు

గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల గూడూరులోని 60 మంది ఫోటోగ్రాఫర్లకు నిత్యావసర సరుకులు అందజేశారు. లాక్‌డౌన్‌తో ఇబ్బందులు పడుతున్నవారిని ఆదుకోవాలంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనల మేరకు తాము ఈ సాయం అందించామని నిర్వాహకులు తెలిపారు. జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి బిల్లు చెంచురామయ్య, గూడూరు మండల పార్టీ అధ్యక్షుడు కొండూరు వెంకటేశ్వర రాజు, ధర్మరాజస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ వాటంబేటి శివకుమార్‌నాయుడు, పి.శ్రీనివాసులు, మోహన్, కార్తీక్, ఫోటోగ్రాఫర్ల సంఘం గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసమూర్తి, దయాకర్, శ్రీనివాసులు, చాన్‌బాషా, కోటి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

## వలస కార్మికులకు భోజనం



వలస కార్మికులకు భోజనం పంపిణీ చేస్తున్న మయూరిశ్యాంయాదవ్, కడివేటి చంద్రశేఖర్ తదితరులు

గూడూరు తహశీల్దార్ బాలలీలారాణి ఆదేశాల మేరకు గూడూరులోని శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్ దాతృత్వంతో 50 మంది వలస కార్మికులకు తహశీల్దార్ కార్యాలయం ఆవరణంలో భోజనం, నీళ్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు. ప్రగతి సేవాసంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, డెప్యూటీ తహశీల్దార్ రామయ్య ఆధ్వర్యంలో ఆ సాయాన్ని వలస కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పునుగు ఆనంద్, వేమారెడ్డి సురేంద్రనాథ్‌రెడ్డి, సతీష్‌తో పాటు తహశీల్దార్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## కొనసాగుతున్న పేర్నాటి సేవలు



గూడూరు నియోజకవర్గంలోని పలు బ్రాహ్మణ కుటుంబాలకు పేర్నాటి ట్రస్ట్ ద్వారా పేర్నాటి శ్యామ్‌కుమార్‌రెడ్డి ఇటీవల బియ్యం, పప్పుదినుసులు, కూరగాయలు, వస్త్రాలు అందజేశారు. కరోనా, లాక్‌డౌన్‌ల నేపథ్యంలో ఇబ్బందులు పడుతున్న అర్చకవృత్తిలో ఉన్న బ్రాహ్మణ కుటుంబాలకు, పూజారులకు పేర్నాటి ట్రస్ట్ వారు ఈ సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పేర్నాటి శ్యామ్ తమ కుమార్తె బిందుఐశ్వర్యతో కలిసి పాల్గొన్నారు. వాకాడు సిఐ నరసింహారావు పాల్గొని పేర్నాటి సేవలను అభినందించారు. బ్రాహ్మణ సంఘం కమిటీ ఉప్పల ప్రసాద్‌గౌడ్, ఉప్పల ప్రభాకర్‌గౌడ్, పాదర్తి రాధాకృష్ణారెడ్డి, చిల్లకూరు వెంకురెడ్డి, దువ్వూరు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### 250 మంది నిరుపేద ముస్లింలకు..

## రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న కమిషనర్ ఓబులేసు

పవిత్రమైన రంజాన్ పర్వదినం సందర్భంగా గూడూరులోని దర్గావీధి దర్గా ఆవరణలో ఈనెల 18న 250 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలవారికి మునిసిపల్ కమిషనర్ ఓబులేసు ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ గౌరవాధ్యక్షుడు షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ రంజాన్ పర్వదినం విశిష్టతను తెలియజేశారు. తన కుమారుడు అనీఫ్ అహ్మద్ వితరణతో రంజాన్ తోఫా కార్యక్రమం చేపట్టామని, రెడ్‌జోన్‌ల పరిధిలో ఉపాధి లేక ఇబ్బందులుపడుతున్న కుటుంబాలకు ఈ సాయం అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇలియాజ్ అహ్మద్, షా నవాజ్, గోల్డ్ గౌస్, నిస్సార్, దర్గా యూత్ సభ్యులు సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



ఈనెల 18న విందూరులో రైతు భరోసా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, పక్కన నాయకులు యల్లసిరి గోపాల్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, రాజారెడ్డి, బాబురెడ్డి, మహేంద్రరెడ్డి తదితరులు



వైయస్సార్‌సిపి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 17న గూడూరులోని గాంధీనగర్‌లో నిరుపేదలకు బియ్యం పంపిణీ చేస్తున్న వైయస్సార్‌సిపి నాయకుడు బత్తిని విజయకుమార్, బత్తిని శ్రీహర్ష

## ఇళ్ల పట్టాల పంపిణీకి..
# త్వరితగతిన లేఅవుట్లు వేయండి

**- జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు**



నెల్లూరు అర్బన్, గ్రామీణ మండలాల పరిధిలో ఇళ్ళ స్థలాల పట్టాలను పంపిణీ చేసేందుకు త్వరితగతిన లేఅవుట్ల ప్రక్రియను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 18న నెల్లూరులో జడ్పీ ఆవరణంలోని డిపిసి సెంటర్‌లో అధికారులతో ఆయన సమావేశమయ్యారు. గుర్తించిన అన్ని లేఅవుట్లలో నిర్దేశించిన గడువులోగా రోడ్లు, స్థలాలను చదును చేయించడం వంటి పనులను పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. వి.వినోద్‌కుమార్, జిల్లా రెవిన్యూ అధికారి మల్లికార్జున, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, జ్యోతిబసు తదితరులు పాల్గొన్నారు.

### 'మనం-మన పరిశుభ్రత'కు ఏర్పాట్లు

జిల్లాలో కొత్తగా 'మనం-మన పరిశుభ్రత' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అనుమతి ఇచ్చారు. మనం-మన పరిశుభ్రత అనే అంశంపై ప్రజలను చైతన్యవంతం చేసేందుకు గ్రామ వార్డు వలంటీర్లకు తగు శిక్షణ ఇస్తామని, ఈనెల 19 నుంచి 31వ తేది వరకు తొలి విడత శిక్షణ ఉంటుందని జిల్లా పంచాయతి అధికారి ధనలక్ష్మి ఆ వివరాలను వెల్లడించారు.



ఈ నెల 21వ తేదీన నెల్లూరులోని భార్గవి ఆటోమొబైల్స్ అధినేత కొండా బలరామిరెడ్డి నివాసంలో పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు, నగదును అందజేస్తున్న కొండా బలరామిరెడ్డి, కొండా నిరంజన్‌రెడ్డి, బ్రహ్మశ్రీ ఆలూరు శిరోమణిశర్మ

# రైతులను ముంచింది చంద్రబాబే!

**- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న**



వైయస్సార్‌సిపీ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందంటూ చంద్రబాబు పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని, రైతులను విస్మరించిన ఘనుడు చంద్రబాబేనని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. విడవలూరు మండలంలోని గోల్కొండాయి తోపు, దళితవాడ, గిరిజన కాలనీల్లో దాతలు వై.భక్తవత్సలరెడ్డి, ఎం.సుధాకర్, డీ.శ్రీనివాసులు, పీ.సురేష్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే చేతుల మీదుగా ఈనెల 17న నిత్యావసర సరుకులు, కూరగాయలు, అరటి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులను అన్ని విధాలా ఆదుకుంటున్నారని, రైతు భరోసా కింద పంటలకు పెట్టుబడిగా ఏడాదికి రూ.13,500 చొప్పున అందజేస్తున్నారని తెలిపారు. 8 మంది టీడీపీ ఎమ్మెల్యేలు తమ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డితో టచ్‌లో ఉన్నారన్నారు. తమ నాయకుడు గేట్లు తెరిస్తే చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా కూడా ఉండదన్నారు. లాక్‌డౌన్‌లో చంద్రబాబుతో పాటు ప్రతిపక్ష నాయకులు ఒక్కరు కూడా కనిపించలేదన్నారు. ఆప్కాబ్ ఛైర్మన్ కొండూరు అనిల్‌బాబు, డీసీఎంయస్ ఛైర్మన్ వీరి చలపతిరావు, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, రాంప్రసాద్, నారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

శ్రీను గల్పిక 988

# మద్యంపై జగన్‌కు లాజిక్ చెప్పిన గాంధీ

తాడేపల్లిలోని స్పీడ్‌స్టార్, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కార్యాలయం. ఎంపీలు విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ ఛైర్మెన్ వై.వి.సుబ్బారెడ్డి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు పేర్ని నాని, కొడాలి నాని, పి.అనిల్‌కుమార్ యాదవ్ తదితరులున్నారు. అప్పుడే ఉపముఖ్యమంత్రి, ఎక్సైజ్‌శాఖ మంత్రి నారాయణస్వామి లోపలకు వచ్చాడు. సీఎం జగన్ ఆయనతో... ఏం స్వామీ, రాష్ట్రంలో మనం మద్యపానాన్ని దశలవారీగా నిషేధించాలనుకుంటున్నాం కదా, ఈ నెలన్నర రోజులు మద్యం లేదుకదా..? ఇప్పుడు షాపులు తెరిచారు, మద్యం తాగేవాళ్లు కొందరైనా తగ్గి వుంటారంటావా అని అడిగాడు. అందుకు నారాయణ స్వామి... ఏమో సార్, మనం అలా వెళ్లి వైన్‌షాపుల వద్ద చూస్తే తెలుస్తుందని అన్నాడు. అలాగైతే చూసొద్దాం పదండి అంటూ జగన్ లేచాడు.

కాన్వాయ్ బయలుదేరి ప్రకాశం బ్యారేజీ మీదుగా విజయవాడ నగరంలోకి వచ్చింది. భవానీనగర్‌లో వెళుతుండగా... రోడ్డు పక్కన దాదాపు నాలుగు కిలోమీటర్ల మేర జనం 'క్యూ' కట్టివున్నారు. అందరూ ఒకర్నొకరు తోసుకుంటున్నారు. జగన్ ఆ సీన్ చూసి మంత్రి పేర్ని నానితో... ఇదేంటి... దుర్గమ్మతల్లి గుడి తలుపులు కాని తెరిచారా... భక్తులు ఇంత దూరం క్యూకట్టారు... అయినా లాక్‌డౌన్ టైంలో గుడి తలుపులు ఎలా తెరిచారు అని ప్రశ్నించాడు. దానికి అక్కడే వున్న దేవాదాయ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ అందుకుని... సార్, వీళ్లంతా దుర్గమ్మ భక్తులు కాదు సార్, భవానినగర్‌లో వున్న వైన్‌షాపు భక్తులు. మనం మద్యం దుకాణాలు తెరవడంతోటే పోలోమంటూ వైన్‌షాపుల ముందు 'క్యూ' కట్టేశారు అని చెప్పాడు. అంతలో వైన్‌షాపులో ఒక మందుబాబు రెండు సీసాలు చేత పట్టుకుని వచ్చాడు. రెండు సీసాలు నెత్తిన పెట్టుకుని 'సాగర సంగమం' సినిమాలో కమల్‌హాసన్‌లా 'తకిట తకిట తధానా, హృదయలయల జతుల ధిల్లానా' అనే పాటకు డ్యాన్స్ చేయసాగాడు. జగన్‌కు ఆ దృశ్యం చూసి నీరసం వచ్చింది. ఈ మందుబాబులు 50 రోజులు కాదు, 50ఏళ్ల పాటు లాక్‌డౌన్ పెట్టి, 50ఏళ్ల తర్వాత వైన్‌షాపులు తెరిచినా మందలు మందలుగా తాగేటట్లున్నారని మనసులో అనుకున్నాడు. నీరసంగా తాడేపల్లి ఇంటికి చేరాడు. అక్కడున్న వైసిపి నాయకులతో... జనాల చేత మద్యం మాన్పించాలి, కాని లాక్‌డౌన్ విలయంలో కూడా జనం మద్యాన్ని మరువలేదు. అందుకని ఈసారి మంచి బ్రాండ్‌ల మద్యం తీసేసి లోకల్ బ్రాండ్‌లు పెట్టిస్తాను, మద్యం నచ్చక, మంచి బ్రాండ్లు దొరక్క అందరూ మందు మానేస్తారన్నాడు. అక్కడున్న అందరూ దానికి తలాడించారు. దాంతో అన్ని వైన్‌షాపులలో లోకల్ బ్రాండ్లు పెట్టి అమ్మకాలు సాగించసాగారు.

లోకల్ బ్రాండ్లు పెట్టాక మద్యం కొనుగోళ్లు తగ్గి వుంటాయని, మందు తాగేవాళ్లు తగ్గుంటారని జగన్ భావించాడు. ఒకసారి చెక్‌చేసి చూద్దామని మళ్లీ బయల్దేరాడు. కాన్వాయ్ భవానీనగర్ వైపుకు పోసాగింది. ఈసారి 'క్యూ' ప్రకాశం బ్యారేజీ మీద నుండే వుంది. ఇది వైన్‌షాపు 'క్యూ'నేనా అని జగన్ అడిగాడు. అవును సార్, అని మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ చెప్పాడు. అక్కడ వైన్‌షాపు వద్ద చూస్తే... ఒక్కో మందుబాబు చేతిలో... 'ఆంధ్రా గోల్డ్', 'ఆంధ్ర లెమన్', 'స్వర్ణాంధ్ర సిగ్నేచర్', 'ఆంధ్రా వాకర్' వంటి బ్రాండ్‌ల సీసాలున్నాయి. మందుబాబుల్లో ఒకడు ఇంకొకడితో... ఎంతైనా మన జగన్ జగనే... నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన మేకిన్ ఇండియా స్ఫూర్తితో మేకిన్ ఆంధ్రా మద్యం బ్రాండ్లనే అమ్మిస్తున్నాడు, మన మద్యం ఆదాయం పక్క రాష్ట్రాలకు పోకుండా చూస్తున్నాడు. జగన్ గ్రేట్ అని తాగుతూ చెప్పాడు. ఆ మాటలు విన్న జగన్... లోకల్ బ్రాండ్లు పెట్టిన ఉద్దేశ్యాన్ని వీళ్లు ఈ విధంగా అర్థం చేసుకున్నారా అని వాపోయాడు. అక్కడినుండి నిరుత్సాహంగా ఇంటికొచ్చాడు. పది నిముషాలు ఆలోచించాడు. మద్యం రేట్లు డబుల్ చేస్తే చచ్చినట్లు మద్యం మానుకుంటారు... అని వెంటనే మద్యం రేట్లు పెంచేస్తూ ఉత్తర్వులు జారీ చేశాడు.

పక్కరోజు మళ్లీ జగన్ మందీ మార్బలంతో భవానినగర్ వద్దకే వెళ్లాడు. ఈరోజు ఖచ్చితంగా వైన్ షాపులు బోసిపోయి వుంటాయి, బుద్ధున్నోడెవడూ నేను పెంచిన రేట్లకు మద్యం కొనుక్కుని తాగడు అని ఆలోచిస్తూ పోతుండగా... అక్కడ కనిపించిన సీన్ చూసి ఒక్కసారిగా షాక్ తిన్నాడు. ఈసారి 'క్యూ' తాడేపల్లి నుండే వుంది... కాన్వాయ్ కొంచెం ముందుకు పోయింది. అక్కడ కొన్ని టెంట్‌లు వేసి వున్నాయి. ఆ టెంట్‌ల క్రింద మందుబాబులు తమ ఆస్తుల దాక్యుమెంట్లు, బంగారు నగలు చేతుల్లో పెట్టుకుని వున్నారు. వడ్డీ వ్యాపారులు వాళ్లకు డబ్బులిచ్చి వాటిని తాకట్టు పెట్టుకుంటున్నారు. మందుబాబులు డబ్బులు తీసుకుని వైన్‌షాపు ముందు 'క్యూ'లో నిల్చుంటున్నారు. ఈ సీన్ చూశాక జగన్ గుండె మండిపోయింది. నేరుగా ఇంటికొచ్చేశాడు. బెడ్‌రూంలో పడుకుని ఎదురుగా గోడకు వేలాడుతున్న గాంధీ తాత ఫోటోను చూస్తూ... ఛీఛీ ఏంది తాతా ఈ జనం... నేను వీళ్ల చేత మద్యం మాన్పించాలని ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా వీళ్లు మానడం లేదు అని పెద్దగా అరిచాడు. అప్పుడు ఫోటోలోని గాంధీ ప్రాణం పోసుకుని... నాయనా జగన్... పులి ముందు జింకను పెట్టి క్యారెట్‌లు, కాకరకాయలు తినమంటే తింటుందా? లాజిక్‌గా ఆలోచించు అని చెప్పాడు. దానికి జగన్... ఆ లాజిక్ అర్థమై కూడా అర్థంకానట్లే... చూద్దాంలే తాతా... వీళ్లు మద్యం పూర్తిగా మానేసే దాకా నేను మద్యం రేట్లు పెంచుతూనే వుంటానని ముసుగుతన్ని పడుకున్నాడు. నాకెందుకొచ్చిన గొడవలే... ఇది బ్రాందీ లోకం, గాంధీ నెవడు పట్టించుకుంటాడనుకుంటూ తన ఫోటో పొజిషన్‌లోకి వెళ్లిపోయాడు మహాత్ముడు.

### ఎమ్మెల్యే కిలివేటి చొరవతో..

## నాయుడుపేటలో రైతుబజార్



సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సూచనలతో నాయుడుపేట వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యాలయం వద్ద వైయస్సార్సీపి నాయకులు ఈనెల 16న రైతు బజార్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపి నాయకులు మాట్లాడుతూ చెన్నైలోని కోయంబేడు మార్కెట్‌తో కరోనా వ్యాప్తి చెందిన నేపథ్యంలో నాయుడుపేట చుట్టుపక్కల మండలాల్లోని కూరగాయల రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు వీలుగా ఎమ్మెల్యే నాయుడుపేటలో రైతుబజార్ ఏర్పాటుకు కృషి చేశారని చెప్పారు. స్థానిక రైతులు పండించిన కూరగాయలతో పాటు చిత్తూరు, కోలార్ తదితర ప్రాంతాల్లోని రైతుల వద్దనుంచి కొనుగోలుచేసిన కూరగాయలు, పండ్లను తక్కువధరలకే ప్రజలకు అందించేలా ఎమ్మెల్యే కిలివేటి చర్యలు తీసుకున్నారని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి, కొండూరు రామకృష్ణంరాజు, కటకం జయరామయ్య, పేట చంద్రారెడ్డి, గాదంశెట్టి మోహన్‌రావు, గంధవళ్ళి సిద్దయ్య, పాలేటి నాగార్జునలతో పాటు అసిస్టెంట్ మార్కెటింగ్ సూపర్‌వైజర్ ఏ.మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలతో మోత మోగిస్తున్నారు

### - టిడిపి నేత బీద రవిచంద్ర



ప్రజలకు పెనుభారంగా మారిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర విజ్ఞప్తి చేశారు. ఆయన ఈనెల 18న స్థానిక టిడిపి నాయకులతో కలసి విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయకుమార్‌కు విజ్ఞాపన పత్రం సమర్పించారు. కరోనా మహమ్మారి వ్యాధి ప్రభావంతో గత రెండు నెలలుగా ఉపాధి లేక పేదలు నానా అవస్థలు పడుతుంటే ప్రభుత్వం ఎలాంటి కనికరం లేకుండా విద్యుత్ చార్జీల భారాన్ని మోపడం దారుణమని ఆయన పేర్కొన్నారు. గతంలో ఏడాదికి ఒకసారి శ్లాబ్‌రేటు మారుతుండగా, వైకాపా ప్రభుత్వం వచ్చాక నెలవారీ శ్లాబ్‌లను నిర్ణయించి ప్రజలపై అదనపు భారం మోపుతున్నదని, బిల్లులు కట్టేందుకు గడువు ఉందని చెప్తూనే మరోవైపు అపరాధ రుసుం వసూలు చేస్తున్నారని విమర్శించారు. పెంచిన విద్యుత్‌చార్జీలను వెంటనే రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలని తగ్గించాలని కోరుతూ ఈనెల 20న అన్ని నియోజకవర్గాల్లో విద్యుత్‌శాఖ డి.ఇ, ఏ.డిలకు వినతిపత్రాలు అందజేస్తామని, 25వ తేదిన మండలాల్లోని ఏ.ఇలకు వినతిపత్రాలు అందజేయాలని నిర్ణయించామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనూరాధ, నుడా మాజీఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## 'అజెండా'

చెదిరిపడ్డ నా స్వప్నవీణ ఆ రోడ్లు
పచ్చని ఆశగా చిగురించాల్సిన సందర్భం
ముడతలు పడ్డ ముసలమ్మ దేహంలా
నెర్రెలు పోయింది
నిశీధిని దుప్పటిగా కప్పుకుని
నిర్మానుష్యంలోకి పయనిస్తోంది.
గమ్యానికి చేరాల్సిన రహదారి
నేల మాళిగల గదిలా సాక్షాత్కరిస్తుంది
ప్రాణ స్పర్శతో వెలిగి పోవాల్సిన ఆ రాచబాట
రాలిపోయిన పండుటాకులా
రెక్కలు తెగిన పక్షిలా నేలకూలింది

అలికిడిలు ఆచ్ఛాదనలు కరువైన రోడ్లు
ఇప్పుడు దుఃఖ సాగరాలు అయ్యాయి
భూమండలానికి ఏ ఆపద వచ్చిందో అని
అక్కడక్కడా తచ్చాడుతున్న పక్షులు
భూగోళంపై నిశ్శబ్ద హస్త కబళింపు అర్థం కాక
సూర్యచంద్రుల గుసగుసలు

స్వేద కాంతులతో వెలిగిపోవాల్సిన దారులన్నీ
మరీచికల సయ్యాటలయ్యాయి
బుడిబుడి నడకల ముచ్చట్లు మోస్తూ
విహంగాలు కావలసిన రోడ్లు
సృష్టికే తనాల పద స్పర్శతో పునీతమై
పసుపు పారాణి పులుము కోవాల్సిన దారులు
కళ్ళల్లో నెత్తుటి చారికలు

ఆ బాటల్లో
వేకువలు వెలుతురులు చిగురించడం లేదు
శబ్దాల పల్లవుల స్వరాల కోసం
గుంటల గాయాల చెవులు రిక్కించి వినడమే
నేటి జెండా
అతుకుల సంక్షోభాల
తలలు తెగ నరికి
శిఖర సాదృశ్యం
కావడమే ఎజెండా!



- చిన్ని నారాయణరావు
9440202942

### ప్రధాని సహాయనిధికి

## 2 లక్షల విరాళం

కరోనా మహమ్మారి వ్యాధి నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు తనవంతు సహాయంగా నెల్లూరు నగరానికి చెందిన బిజెపి సీనియర్ నేత డాక్టర్ చిలుకోటి వరదయ్య, ఆయన కుమార్తె మారం విజయలక్ష్మి లక్ష రూపాయల వంతున మొత్తం 2 లక్షల రూపాయలను ప్రధాని సహాయనిధికి విరాళంగా అందజేశారు. ఎస్‌బిఐ బ్యాంక్ ద్వారా పిఎం కేర్ ఫండ్ ఖాతాకు ఆ మొత్తాన్ని పంపినట్లు వారు పేర్కొన్నారు.

### వార్డు సచివాలయాలకు

## నోడల్ అధికారులు

నెల్లూరు నగరంలోని 167 వార్డు సచివాలయాలకు ఉన్నతాధికారులు ఈనెల 18న నోడల్ అధికారులను నియమించారు. ఆరుగురు నోడల్ అధికారులతో పాటు, మరో 27 మంది ఇన్‌చార్జిలను కూడా నియమించారు. వీరంతా సచివాలయాల పనితీరును పరిశీలించనున్నారు.

### ఎస్ఈబీ అధికారిగా

## శ్రీధర్ బాధ్యతల స్వీకరణ

స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) జిల్లా అధికారిగా ఏఎస్పీ వెంకట శ్రీధర్‌రావు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈనెల 16న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సరిహద్దు చెక్ పోస్టులపై ప్రత్యేక నిఘాను ఉంచి మద్యం, ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేస్తామని తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ భాస్కర్‌భూషణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## వలస కూలీలకు బట్టేపాటి ఓదార్పు



సామాజిక కార్యకర్త బట్టేపాటి మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో మిత్రమండలి వారు దగదర్తి మండలంలో జాతీయ రహదారిపై నడిచి వెళుతున్న వలస కూలీలకు ఆహార పొట్లాలు, మంచి నీళ్ళు, మజ్జిగ, లస్సీ, బిస్కెట్ ప్యాకెట్లు, బ్రెడ్లు, పండ్లు అందజేస్తున్నారు. లాక్‌డౌన్ ముగిసే వరకు కూడా వలస కూలీలకు ప్రతిరోజూ ఇలా సేవలందిస్తూనే వుంటామని బట్టేపాటి మహేష్‌రెడ్డి పేర్కొన్నాడు. సిద్దారెడ్డి హరీష్‌రెడ్డి, పోలిశెట్టి శ్రీనివాసులు, బట్టేపాటి హర్షవర్ధన్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, దినేష్‌రెడ్డి, మస్తాన్, చైతన్యభార్గవ్, రమేష్, శుభకర్, సాత్వికరెడ్డి, సాయి సందీప్‌రెడ్డి, కృష్ణ, ఏటూరి వెంకటేష్‌రెడ్డి తదితరులు ఈ సేవా కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

## పెరిగిన చార్జీలు.. ప్రజలకు కష్టాలు

### - విద్యుత్ బిల్లులపై పిసిసి అధ్యక్షుడు శైలజానాథ్ విమర్శ



కరోనా మహమ్మారి వ్యాధి వ్యాప్తి నేపథ్యం, లాక్‌డౌన్ పరిస్థితుల్లో ప్రజలు కష్టాల్లో ఉన్నపుడు విద్యుత్ చార్జీలను పెంచడం దారుణమని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎస్.శైలజానాథ్ విమర్శించారు. ఈనెల 16న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే విద్యుత్ చార్జీలను చెల్లించి ప్రజలను ఆదుకోవాలని, లాక్‌డౌన్‌తో ఇళ్ళలోనే కాలం గడుపుతున్న ప్రజల సమస్యలు తీర్చాలని అన్నారు. ప్రధాని ప్రతిపాదించిన సమయంలో రాష్ట్రాలు వెంటనే కరోనా నివారణకు తగు జాగ్రత్తలు తీసుకుని ఉంటే కరోనా వ్యాధి ఉధృతిని తగ్గించగలిగే పరిస్థితి ఉండేదన్నారు. వలస కార్మికులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, వారికి వైద్యపరీక్షలుచేసి వారి స్వస్థలాలకు వెళ్ళే ఏర్పాట్లు చేయాలని కోరారు. వలస కూలీలను ఆదుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సొంతనిధులతో రెండు రైళ్ళను ఏర్పాటుచేసిందని, అయితే ప్రభుత్వాలు వీటిని తమవిగా చెప్పుకోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా, లాక్‌డౌన్ల నేపథ్యంలో ప్రజలు ఎన్నో రకాల సమస్యలను ఎదుర్కొంటున్న ఈ తరుణంలో ఏప్రిల్ నుండి విద్యుత్‌చార్జీలను పెంచడమే కాక, రెండు నెలల బిల్లులను ఒకేసారి ఇచ్చినందువల్ల ప్రజలకు వాటిని చెల్లించాలంటే ఎంతో కష్టంగా ఉంటుందన్నారు. వెంటనే విద్యుత్‌చార్జీలను తగ్గించాలని, విద్యుత్ బిల్లుల భారం ప్రజలపై పడకుండా చూడాలని ఆయన కోరారు. కాంగ్రెస్ నాయకులు బాలసుధాకర్, ఉడతా వెంకట్రావ్, నాగేంద్రప్రసాద్, శ్రీనివాసులు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏకాంతంగా హనుమజ్జయంతి



నెల్లూరు జిల్లాలో ఈనెల 17న హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. లాక్‌డౌన్ నేపథ్యంలో ఆలయాల్లో ఏకాంతంగా విశేష పూజలు చేశారు. కరోనా నివారణకు లోకశాంతి కోసం అభిషేకాలు, శాంతి హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లూరులోని అన్ని ఆంజనేయస్వామి మందిరాల్లో హనుమజ్జయంతి వేడుకలు, పూజలు జరిగాయి. దర్గామిట్ట రాంనగర్‌లోని శబరి శ్రీరామక్షేత్రంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి ఉదయం నుండి సాయంత్రం వరకు అభిషేకం, హోమం, లక్ష మల్లెల పూజ, పూర్ణాహుతి, ఒంటె వాహనసేవ తదితర కార్యక్రమాలను ఆలయ అర్చకులు సత్యనరేష్ స్వామి నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ పిడూరు కిషోర్‌రెడ్డి, మెంబర్ శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు. రాయాజీ వీధి, ఫత్తేఖాన్‌పేట, సంతపేట, మూలాపేట ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు.



## సాయిదర్బార్ అద్దాల మందిరంలో..

నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతి నగర్‌లోని శ్రీ సాయిదర్బార్ అద్దాల మందిరంలో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహానికి హనుమజ్జయంతి పర్వదినం సందర్భంగా పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు, ఆకుపూజ, వడమాల పూజ తదితర విశేష పూజలను ఆలయ అర్చకులు ఏకాంతంగా నిర్వహించారు. హనుమజ్జయంతి సందర్భంగా శ్రీ సాయిదర్బార్ 15వ వార్షికోత్స వాన్ని ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన సాయి, సేవాదళ్ సభ్యులు బాబీ సాయి తదితరులు వైభవంగా నిర్వహించారు.

# వలస కూలీల వెతలు చూసి..
# సిగ్గుతో తలదించుకుంటున్నా!




జాతీయ రహదారిపై ఒడిస్సా, బీహార్ వంటి రాష్ట్రాలకు నడిచి వెళుతున్న వలస కూలీల వెతలు చూసి సిగ్గుతో తలదించుకుంటున్నానని మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నాడు. బుధవారం రాత్రి వెంకటాచలం వద్ద నడిచి వెళుతున్న వలస కూలీల గురించి సమాచారం అందుకున్న ఆయన వెంటనే స్పందించి ప్రత్యేక వాహనాల ద్వారా వారిని నెల్లూరు సమీపంలో ఎన్టీఆర్ నగర్ వద్దకు తరలించి బస ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి సహకారంతో వారికి ఆరోజు రాత్రి భోజనం, గురువారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నానికి మళ్లీ భోజనం పార్శిల్ వసతి కల్పించారు. విజయవాడ వైపువెళ్లే లారీలను ఆపి వారిని అందులో ఎక్కించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ వలస కూలీలను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ధ్వజమెత్తాడు. రోడ్లపై వలస కూలీలు పడుతున్న కష్టాలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోందని, మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించాడు.

## వలస కూలీలకు నగదు సాయం

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హైదరాబాద్ నుండి నెల్లూరు వస్తూ హైవేలో మండుటెండలో నడిచి వెళుతున్న వలస కూలీలను చూసి చలించిపోయారు. వెంటనే ఆయన కారు ఆపి, జేబులో వున్న మొత్తం నగదును తీసి తన మనుమరాలు ద్వారా వలస కూలీలకు అందించారు.

# ఆనంకు కరోనా పరీక్ష



వెంకటగిరి శాసనసభ్యులు ఆనం రామనారాయణరెడ్డి, వారి సతీమణి శ్రీమతి శిరీషమ్మలకు గురువారం నెల్లూరు సంతపేటలోని వారి ఇంట్లో వైద్య సిబ్బంది గురువారం కరోనా పరీక్షలు నిర్వహించారు. వారి కుటుంబసభ్యులకు, సిబ్బందికి కూడా పరీక్షలు నిర్వహించగా, అందరికీ నెగటివ్‌గా రిపోర్టులు వచ్చాయి.



## రాజీవ్‌కు నివాళి

మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 29వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 20వ తేదీన నెల్లూరు, ఏ.సి స్టేడియం వద్దగల ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కె.రఘురాం ముదిరాజ్, భవానీ నాగేంద్రప్రసాద్, దద్దోలు రమణయ్య గౌడ్, పి.శ్రీనివాసులు, నారాయణ రావు, కనకరాజు, జొన్నా శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఎస్‌ఆర్ ఆధ్వర్యంలో..
# కూరగాయల పంపిణీ



వైసిపి నాయకులు రాయపు శ్రీనివాసరావు(ఆర్‌ఎస్‌ఆర్) ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నెల్లూరు, 20వ డివిజన్ పరిధిలోని గిలకబావి సంఘంలో 110 కుటుంబాల వారికి కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు రియాజ్, చేజర్ల మహేష్‌బాబు, పెనుబాక దినేష్‌రెడ్డి, పోతురాజు రవి, కృష్ణమోహన్‌రెడ్డి, కిషోర్, ఆనంగి రమణయ్య, బొమ్మన శీనయ్య, కమలాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్, చేజర్ల శ్రీను, సిద్ధు, అజయ్ పాల్గొన్నారు.

# పండ్ల మార్కెట్ తనిఖీ



నెల్లూరు నగరపాలక సంస్థ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏసునాయుడులు 21వ తేదీ నెల్లూరులోని హోల్‌సేల్ పండ్ల మార్కెట్‌ను తనిఖీ చేశారు. పండ్లు మాగేందుకు రసాయనాలు కలుపుతున్నారన్న సమాచారంతో వారు ఈ తనిఖీలు చేపట్టారు. పండ్లకు సంబంధించి రసాయనాలు వాడితే కఠిన చర్యలుంటాయని వారు పండ్ల వ్యాపారులను హెచ్చరించారు.

## ఇస్కాన్ భోజనం



బుధవారం చెన్నై నుండి గిరిజానుకు శ్రామిక్ రైలు ద్వారా వెళుతున్న 15000మంది వలస కూలీలకు నెల్లూరులోని ఇస్కాన్ మందిరం వారు భోజనం సమకూర్చారు. ఇస్కాన్ ప్రతినిధి డాక్టర్ శుకదేవస్వామి ఆధ్వర్యంలో నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్‌లో వారికి భోజనం ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ మేనేజర్ రాజశేఖరస్వామి, పాలిచర్ల కేశవరెడ్డి, తంబులూరు భాస్కర్‌రెడ్డి, కొండ్లపూడి సులోచన పాల్గొన్నారు.

# వలస కూలీలకు జనసేన సాయం



జనసేన జిల్లా నాయకులు చెన్నారెడ్డి మనుక్రాంత్ వలస కూలీల సహాయార్థం ఇటీవల నెల్లూరు, చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. దాదాపు 5వేల మంది వలస కార్మికులకు మజ్జిగ, అరటిపండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిషోర్, ప్రశాంత్, శ్రీకాంత్, డాక్టర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## రవికాంత్‌కు డిప్యూటీ సిటిఎం బాధ్యత

నెల్లూరు ఆర్టీసీ రీజియన్ ఇన్‌ఛార్జ్ డిప్యూటీ సిటిఎంగా రవికాంత్ బాధ్యతలు స్వీకరించారు. గత కొంతకాలంగా ఈ పోస్ట్ ఖాళీగా వుండడంతో పడుగుపాడు వర్క్‌షాపులో వర్క్స్‌మేనేజర్‌గా వున్న రవికాంత్‌కు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు అప్పగించారు.

# పెట్టుబడులకు స్వర్గధామం శ్రీసిటీ

## - ప్రత్యేక పుస్తకంలో వెల్లడి




'డూయింగ్ బిజినెస్ ఇన్ ఇండియా గైడ్' ప్రచురణల శ్రేణిలో భాగంగా, భారత ప్రభుత్వసంస్థ ఇన్వెస్ట్ ఇండియా, జెఎల్ఎల్ ఇండియా సహకారంతో, 'భారతదేశంలో తయారీ పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూల ప్రదేశాలు' అన్న శీర్షికతో ప్రచురించిన పుస్తకాన్ని ఈనెల 20వతేదీ విడుదల చేసింది. ప్రపంచంలోని ఇతర దేశాల నుండి పెట్టుబడులను ఆకర్షించే అధిక సామర్థ్యాన్ని కలిగి ఉన్న భారతదేశంలోని 9 రాష్ట్రాలలో గల సెజ్‌లలో నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలోని శ్రీసిటీకి ప్రత్యేక స్థానం కల్పించింది.

దీనిపై శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ "చెన్నై-తిరుపతి-నెల్లూరు ట్రై-సిటీ పారిశ్రామిక కేంద్రం, రెండు ప్రధాన పారిశ్రామిక కారిడార్లయిన చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సిబిఐసి) మరియు విశాఖపట్నం-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్(విసిఐసి)ల పరిధిలోకి శ్రీసిటీ వస్తుందని, 27 దేశాల నుండి 187కిపైగా ప్రతిష్టాత్మక కంపెనీలను కలిగి, దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక పార్క్‌గా శ్రీసిటీ అవతరించిందని పేర్కొన్నారు. అద్భుతమైన రహదారి మరియు రైలు కనెక్టివిటీ, నాలుగు నౌకాశ్రయాలకు మరియు రెండు అంతర్జాతీయ విమానాశ్రయాలకు దగ్గరలో ఉందని అన్నారు.

కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో, ప్రత్యామ్నాయ వ్యాపార కొనసాగింపు ప్రణాళికలో భాగంగా వీటిని ప్రోత్సహించడా నికి, వివిధ రంగాల అవసరాలు, పన్ను ప్రోత్సాహకాల ఆధారంగా వ్యాపారాన్ని నెలకొల్పడానికి ఇవి అత్యంత ఆకర్షణీయమైన అనుకూల స్థానాలు అని ఇన్వెస్ట్ ఇండియా తన ప్రచురణలో పేర్కొంది.

# వేశారు... తీసేశారు...

- నెల్లూరు కార్పొరేషన్‌కు అచ్చిరాని ఐఏఎస్

నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి అయిన స్వప్నిక్ దినకర్ పాద్కర్ బదిలీ రద్దయ్యింది. తొలుత కృష్ణాజిల్లా నూజివీడు సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇక్కడకు బదిలీ చేసింది. ఇక రెండు రోజుల్లో ఆయన వచ్చి ఛార్జ్ తీసుకుంటాడనగా అకస్మాత్తుగా ఆయన నెల్లూరు బదిలీని రద్దుచేసి కాకినాడ కార్పొరేషన్ కమిషనర్‌గా పంపించారు. ప్రస్తుతానికి బాపిరెడ్డే నెల్లూరు కమిషనర్‌గా కొనసాగనున్నారు. ఈ సంఘటనతో నెల్లూరు నగర పాలక సంస్థకు కమిషనర్‌లుగా ఐఏఎస్ ఆఫీసర్లు కలిసిరారనే విషయం అర్ధమైపోయింది. అయ్యో! యస్. అనేవాళ్ళే ఇక్కడ మనగలరు. గతంలో చక్రధర్‌బాబు అనే ఐఏఎస్ ఆఫీసర్‌ను వేసినా, 8 నెలలు తిరక్కముందే బదిలీపై వెళ్లిపోవడం తెలిసిందే!


# నాగబాబు నోరు.. నాగుపాము తీరు

## - చేవూరు ఫైర్



మహాత్మా గాంధీని కించపరుస్తూ, గాంధీని హత్య చేసిన నాథూరాం గాడ్సేను దేశభక్తుడిగా సంభోధించిన సినీనటుడు నాగబాబుపై జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఫైర్ అయ్యాడు. 20వ తేదీ నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగాబ్రదర్ నాగబాబు జబర్దస్త్ షోలో ఆర్టిస్టులపైన చేసే వ్యాఖ్యలు జాతిపిత మహాత్మాగాంధీపై చేస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వుంటుందని హెచ్చరించాడు. గాడ్సేను దేశభక్తుడిగా అభివర్ణించడం నాగబాబు మూర్ఖత్వానికి నిదర్శనంగా ఆయన పేర్కొన్నాడు. ప్రపంచంలో అన్ని దేశాలు మహాత్మాగాంధీని శాంతికి ప్రతిరూపంగా భావిస్తుంటే, నాగబాబుకు మాత్రం గాడ్సే దేవుడుగా కనిపించడం విచారకరమన్నాడు. మహాత్మాగాంధీని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన నాగబాబుపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశాడు.

ప్రపంచ మానవాళిని పట్టి పీడిస్తూ కరోనా మహమ్మారి వ్యాధి ఇంకా విజృంభిస్తూనే ఉంది. అనేకదేశాల ప్రజల ప్రాణాలు తీస్తూ కరోనా రక్కసి విలయతాండవం చేస్తూనే ఉంది. ఈనెల 20 అర్ధరాత్రి సమయానికి ప్రపంచవ్యాప్తంగా ఈ మాయదారి వ్యాధి బారిన పడి 3,26,421 మంది మృతి చెందినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.



# కరోనా రాకాసి.. కరాళనృత్యం

- ప్రపంచవ్యాప్తంగా 3 లక్షలా 26 వేల మంది బలి
- మరో 50 లక్షలా 37 వేలకు పైగానే బాధితులు

కరోనా రక్కసి మానవాళి ప్రాణాలు తీస్తూ తీవ్రాతి తీవ్రంగా విజృంభిస్తుండడంతో ప్రపంచం గడగడ వణికి పోతూ ఉంది. కంటికి కనిపించని కోవిడ్-19 అనే వైరస్‌తో కూడిన సూక్ష్మక్రిమి విశ్వవ్యాప్తంగా వీరవిహారం చేస్తూ మానవ సంహారం సాగిస్తూనే ఉంది. ప్రపంచంలో ఎక్కడ ఉన్నవారికైనా ఈ వ్యాధి ఏరోజు ఎప్పుడు ఎవరికి అంటుకుంటుందో, ఎవరిని కబళిస్తుందో అంతుపట్టడం లేదు. దీంతో ప్రపంచమంతా ఎక్కడికక్కడ స్తంభించిపోతూ ఉంది. కరోనా పుట్టినిల్లయిన చైనాలో తొలి కరోనా వైరస్ వెలుగులోకి వచ్చి ఇప్పటికి ఆరునెలలైంది. చైనాలో ఈ కేసులు తగ్గినట్లే తగ్గి మళ్ళీ ఊపందుకుంటున్నాయి. ఈ వ్యాధి ప్రపంచానికి అంటుకోవడంతో ఇప్పుడు కరోనా కేసుల సంఖ్య ప్రపంచవ్యాప్తంగా అరకోటికి దాటిపో యాయి. ఈనెల 20వతేది నాటికి కరోనా వ్యాధి బారిన పడిన వారి సంఖ్య అక్షరాలా 50,37,922 మంది కావడం ప్రపంచ మానవాళిని తీవ్ర భయాందోళనలకు గురిచేస్తూ ఉంది. అయితే, అదృష్టవశాత్తూ ఈ వ్యాధి కోరల నుంచి బయటపడిన వారి సంఖ్య కూడా కొంత మేరకు ఆశాజనకంగానే ఉండడం కొద్దిగా ఊరటేనని చెప్పవచ్చు. ఇప్పటిదాకా ఈ వ్యాధితో వైద్య చికిత్సలు పొంది ఎట్టకేలకు కోలుకున్నవారు 19 లక్షలా 82వేలా 669 మంది దాకా ఉండడం మంచి పరిణామం. వీరు కాక, ఇంకా చికిత్స పొందుతున్నవారు మరో 27 లక్షల మందికిపైగానే ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

### అమెరికాలో అల్లకల్లోలం..

కరోనా రాకాసి అగ్రరాజ్యం అమెరికాను అల్లకల్లోలం చేస్తోంది. అక్కడ కరోనా మరణమృదంగం మోగిస్తోంది. ఇప్పటికే 93,858 మంది ఈ వ్యాధి దెబ్బకు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ప్రత్యేకించి కరోనా తీవ్రంగా ఉన్న న్యూయార్క్, న్యూజెర్సీ రాష్ట్రాలు శవాలదిబ్బలుగా మారి పోయాయి. అమెరికాలోని మారుమూల ప్రాంతాల్లోకి కూడా కరోనా వైరస్ శరవేగంగా వ్యాపిస్తూనే ఉంది. రష్యాలో కూడా కరోనా కేసులు 3 లక్షలు దాటగా, ఈ వ్యాధితో చనిపోయినవారి సంఖ్య 3 వేలమందికి పైగానే ఉన్నారు. బ్రిటన్‌లో 2 లక్షలా 50వేలకు పైగా కేసులు నమోదు కాగా, 35 వేలమందికి పైగానే మృతిచెందారు. బ్రెజిల్‌లో ఇప్పటికదాకా 2 లక్షలా 70వేల మందికి పైగానే వ్యాధి బారినపడ్డారు. 18,121 మంది చనిపోయారు. స్పెయిన్‌లో 27,778 మంది మృతిచెందారు.

### భారత్‌లోనూ ఉధృతి..

కరోనా ఉధృతి భారత్‌లోనూ క్రమేణా పెరుగుతూనే ఉంది. ఈనెల 21 నాటికి కరోనా బారినపడిన వారి సంఖ్య లక్షా 12వేలా 359కి చేరుకున్నాయి. 3435 మంది మృత్యువాతపడ్డారు. దీంతో భారతప్రభుత్వం కరోనా నివారణ చర్యలను మరింత కట్టుదిట్టం చేస్తూనే ఉంది. ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతూ ఈ వ్యాధి కోరల నుంచి బయటపడి కోలుకున్నవారి సంఖ్య 45,300 కాగా, ఇంకా చికిత్స పొందుతున్నవారు 61,149 మంది దాకా ఉన్నారు.

### ఆంధ్రలోనూ జోరు..

ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటిదాకా ఈ వ్యాధితో 53 మంది మరణించగా, కరోనా కేసుల సంఖ్య 2602కు పెరిగింది. 1640 మంది ఈ వ్యాధి నుంచి కోలు కున్నారు. అదేవిధంగా నెల్లూరుజిల్లాలోనూ కరోనా కలవరం పెరుగుతూనే ఉంది. ఈనెల 21 నాటికి జిల్లాలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 2018కి చేరగా, మృతుల సంఖ్య 4కు పెరిగింది.

## విజిలెన్స్ ఇన్‌చార్జి ఎస్పీగా

# వెంకటనాథ్‌రెడ్డి

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌చార్జి ఎస్పీగా వెంకటనాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆ శాఖ ఎస్పీగా పనిచేసిన వెంకట శ్రీధర్‌రావు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జిల్లా అధికారిగా బదిలీ అయ్యారు. ఈ క్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓఎస్డీగా ఉన్న వెంకటనాథ్‌రెడ్డికి ఉన్నతాధికారులు ఇన్‌చార్జి ఎస్పీ బాధ్యతలప్పగించారు.

# కరోనా దెబ్బ.. రిజిస్ట్రేషన్లు నిల్!

కరోనా మహమ్మారితో లాక్‌డౌన్ విధించడంతో మార్చి నెల 26 నుంచి నెల్లూరు జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు నిరవధికంగా మూతపడ్డాయి. దీంతో రూ.60కోట్లకుపైగా ఆదాయానికి గండి పడినట్లు సమాచారం. ఇదిలా వుంటే ప్రభుత్వం కొన్ని సడలింపులిచ్చి, భౌతిక దూరం పాటిస్తూ దస్తావేజులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఈనెల 5 నుంచి పునఃప్రారంభించింది. అయితే జిల్లా అధికారులకు కొన్ని సూచనలు చేసింది. కంటోన్మెంట్ జోన్లు, రెడ్ జోన్లలో వీటిని పునఃప్రారంభించరాదని పేర్కొంది. దీంతో నెల్లూరు తప్ప సూళ్ళూరుపేట, కోట, రాపూరు, ఉదయగిరి, ఆత్మకూరు, కావలి, తదితర చోట్ల కార్యాలయాలను పునఃప్రారంభమయ్యాయి. అయితే కోయంబేడు మార్కెట్ ప్రభావంతో సూళ్ళూరు పేటలో కార్యాలయం మళ్ళీ మూతపడింది. తెరిచిన సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో కూడా రిజిస్ట్రేషన్లు లేక బోసిపోతున్నాయి.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com